హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణం ప్రజావ్యతిరేకం : సీపీఐ

విశాలాంధ్ర - దేవరాపల్లి : దేవరాపల్లి మండలం చింతలపూడి పంచాయతీ శివారు బల్లిపురం నుంచి విజయ నగరం జిల్లా వేపాడ మండలం వీలుపర్తి వరకు రైతులకు వ్యతిరేకంగా చేపట్టనున్న హైడ్రో పవర్ ప్లాంట్ పరిశీలన చేయడానికి అనకాపల్లి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ తో పాటు సిపిఐ బృందం శనివారం స్వయంగా వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఐ కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ బడా కార్పొరేట్ సంస్థ ఆధాని గ్రూప్ స్థాపించబోయే ఈ పవర్ ప్లాంట్ వలన శారదా నది మీద నిర్మించిన రైవాడ జలాశయం పూర్తిగా ఎడారిగా మారిపోతుంది. అలాగే అనేక గిరిజన గ్రామాలు ముంపుకు గురవడంతో పాటు రైవాడ జలాశయం పై ఆధారపడి ఉన్న గ్రామాల రైతులు పూర్తిగా నష్టపోతారని,శారద నది పరివాహక ప్రాంతంలో ఉన్న 14 గిరిజన గ్రామాల ప్రజలు దేవరాపల్లి, కె కోటపాడు, చోడవరం, అనకాపల్లి, మునగపాక, మండల రైతులు ఈ జలాశయంపై ఆధారపడి అనేక పంటలు పండిస్తున్న వేలమంది రైతు కుటుంబాలు సాగునీరుకి ఇబ్బందులు పడటంతో పాటు గోవాడ, తుంపాల చక్కెర కర్మాగారాలు మూతపడతాయని ఆయన అన్నారు. ఈ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వలన పచ్చని పంట పొలాలన్ని బీడు భూములగా మారిపోతాయని, దేశానికి వెన్నెముక అయిన రైతన్న పొట్టపై కొట్టి,అధాని లాంటి వారిని ప్రోత్సహించటం సరికాదన్నారు. ఈ ప్రాజెక్టు పనులు వెంటనే నిలిపివేయకపోతే జన సమీకరణ చేసి పెద్ద ఎత్తున సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు వేమల కన్నబాబు, గొర్లె దేముడుబాబు,దేవరాపల్లి మండల సిపిఐ కార్యదర్శి గరికిన రాజు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వియ్యపురాజు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర - చింతపల్లి : విశాలాంధ్ర పత్రికలో వార్తలే గాక, ఆ పత్రిక క్యాలెండర్, డైరీ ల రూపకల్పన అత్యద్బు తమని పాడేరు శాసనసభ్యులు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం చింతపల్లి వచ్చిన ఆమెను స్థానిక విశాలాంధ్ర పాత్రికేయుడు షేక్ ఖాసిం వల్లి కలసి ఆమె చేతుల మీదుగా విశాలాంధ్ర డైరీ ఆవిష్కరణ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడు దశాబ్దాలుగా ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్న పత్రిక విశాలాంధ్ర అన్నారు. అటువంటి ఈ పత్రిక క్యాలెండర్, డైరీల రూపకల్పనలోనూ తన ప్రతిభ కనబరుస్తూ ప్రజల మన్ననలు పొందుతుందని ఆమె అభిప్రాయం చేశారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుక

విశాలాంధ్ర - అరకులోయ : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను శనివారము ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో నూతన విద్యార్థిని విద్యార్థులకు పూర్వ విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. విద్యార్థుల ఆటపాటలతో కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమానికి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్స్ డాక్టర్ కె భరత్కుమార్ నాయక్, డాక్టర్ సిహెచ్ రామకృష్ణ అధ్యక్షత వహించి విద్యార్థినీ విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు పొందే దిశగా కృషి చేయాలనీ, లక్ష్యాలను నిర్దేశించుకుంటూ వాటికి అను గుణంగా కష్టపడాలని ప్రిన్సిపాల్స్ సూచించారు. అంతకుముందు పలువురు విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టు కున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకుల బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

ఏజన్సీలో గ్రంథాలయాలకు మహర్దశ

విశాలాంధ్ర - రంప చోడవరం : రంప చోడవరం డివిజన్ ఏడు మండలాల్లో శిధిలావస్థ లో ఉన్న గ్రంథాలయాలను పునర్నిమించి అన్ని హంగులతో తీర్చిదిద్దడం జరిగిందని రంప చోడవరం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు .పాతపడిన గ్రంథాలయాలకు పునర్మించి డిజిటల్ లైబ్రరీ గా ఐఎఫ్పి పానెల్ ఏర్పాటు చేసి అందరికి అందుబాటులోకి తీసుకురావటం జరిగిందన్నారు .ఏజన్సీలో విద్యార్థులు యువతీ యువకులు గ్రంథాలయాలను సందర్శించి సద్వినియిగం చేసుకోవాలని సూచించారు.

పేదలు సొంత ఇంటి కళను నిజం చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డిదే : ఎమ్మెల్యే ముత్తంశెట్టి

విశాలాంధ్ర - ఆనందపురం : పేద ప్రజలకు గృహము ఒక కల, ప్రతి పేదవాడు వారి జీవితంలో మంచి నివాసాన్ని ఏర్పాటు చేసుకొని జీవించాలని కలగంటారు. పేదరికం వల్ల అది కొందరికి సాధ్యపడుతుంది కొందరికి సాధ్యపడదు కానీ జగన్మోహన్ రెడ్డి కృషితో పేద ప్రజలకు ఇంటి కోరిక తీరిందని భీమిలి శాసనసభ్యులు ముత్తం శెట్టి శ్రీనివాసరావు తెలిపారు శనివారం మండలంలో దబ్బంద గ్రామపంచాయతీ పరిధిలో 4080 గృహాల్లో 1920 టిడ్కో గృహాలను, భీమిలి శాసనసభ్యులు అవంతి శ్రీనివాస్, విశాఖ జిల్లా ఎంపీ ఎంవివి సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టిడ్కో చైర్మన్ ప్రసన్న కుమార్ చేతుల మీదుగా ప్రారంభించి లబ్ధిదారులకు ఇంటి పేపర్లతో సహా తాళాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో దబ్బంద 1902 గృహాలతో అతిపెద్ద లేఔట్ అని ప్రతి లబ్ధిదారునికి 22 గజాలను , సుమారు 8 లక్షలు రూపాయలు విలువైన ప్లాట్లను 60 వేల రిజిస్ట్రేషన్ చార్జీలతో అందించామన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా ఎంపీ ఎంవి.విసత్యనారాయణ, టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్, పార్టీ ప్రెసిడెంట్ బంక సత్యం, జడ్పిటిసి వెంకటరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్రావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, బలిరెడ్డి మహేష్, ఎంపీటీసీ డోల గౌతమి ఆనంద్, సర్పంచ్ మల్లికార్జున, మాజీ ఎంపిటిసి డోలా దేముడు, గోవింద్, బిఆర్బి నాయుడు, మహంతి శివాజీ రౌతు శ్రీను, ఎంపిడిఓ అప్పలనాయుడు, సంబంధిత తదితరులు పాల్గొన్నారు.

భాస్కర్ విద్యానికేతన్ హై స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్

విశాలాంధ్ర - గాజువాక సిటీ : గాజువాక చట్టివాని పాలెం లో భాస్కర్ విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులచే సైన్స్ ఎగ్జిబిషన్ వైజాగ్ ఫిలాటిలిక్ సొసైటీ కె.సి నాయుడు, విశ్వనాథం, కె.శ్రీనివాస్, పి.గోవింద్ రాజు, జె.ఎస్.సురేష్ నాణేలు, స్టాంపులు ప్రదర్శన కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉదయం 10:00 గంటలకు జిల్లా ఉప విద్యాశాఖాదికారి ఎ.గౌరి శంకరరావు శనివారం ప్రారంభించారు. నర్సరీ నుండి 10 వ తరగతి వరకు విద్యార్థులు పలురకాల ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు.సోలార్ ఎనర్జీ ట్రాఫిక్ నిబంధన లు, రైలు ప్రమాదముల నివారణ, మానవ హృదయం, సండె పనితీరు, ఇస్రో ప్రయోగాలు, రోడ్డుపై చెత్తను సులువుగా సేకరించుట విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమం పాఠశాల డైరక్టర్ పాలవలస భాస్కర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించగా సైన్స్ ఉపాధ్యా యినీలు గౌతమి, శ్వేత గౌరే, అమరావతి, ప్రణీత, రాణి లు విద్యార్థులచే ప్రాజెక్టులు తయారు చేయడంలో సహకరించి ప్రోత్సహించారు. ఈ ఎగ్జిబిషన్ ను చిట్టినాయుడు కాలనీ లో చట్టివాని పాలెం, దశమి కొండ కోలనీ తల్లిదండ్రులు, ఈ పాఠశాల విద్యార్థుల తల్లి దండ్రులు, ఇతర స్కూల్స్ నుండి విద్యార్థులు, జివ్సా పరిధి లో గల పాఠశాల విద్యార్థులు డైరక్టర్లు సందర్శించి విద్యార్థులను అభినందించారు.

అట్టహాసంగా లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ మహిళా ఉపాధి సేవా మహోత్సవం

విశాలాంధ్ర - నర్సీపట్నం : లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధి సేవా మహోత్సవం శనివారం అట్టహాసంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన లైన్స్ క్లబ్ కమ్యూనిటీ భవనం ఆవరణలో ఏర్పాటుచేసినఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ గత అంతర్జాతీయ అధ్యక్షులు ఫ్రాంక్ మూరే 3 (అమెరికా) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మొట్టమొదటిసారిగా నర్సీపట్నం విచ్చేసిన ఆయనకు లయన్స్ క్లబ్, మరియు నవ్య లయన్స్ క్లబ్ సభ్యులు మేళ తాళాలతో, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. సుమారు కోటి రూపాయలకు పైగా వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్, మరియు విజన్ కేర్ సెంటర్ ను ఆయన ప్రారంభించారు. రూ.30 లక్షల విలువైన కుట్టు మిషన్లు, గ్రైండర్లు, సైకిళ్లు, మహిళలకు బాలికలకు పంపిణీ చేశారు. అనంతరం చెవిటితనంతో బాధపడుతున్న వారికి వినికిడి యంత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్ చింతకాయల సన్యాసి పాత్రుడు, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ లయన్ విప్పల ప్రసాద్, ట్రెజరర్ లయన్ కాళిదాసు, సభ్యులు లయన్ కర్రి రాంగోపాల్, లయన్ గొలుసు శ్రీనివాసరావు, లయన్ రఘు, తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్‌తో తాగునీటి సౌకర్యం

విశాలాంధ్ర - దుంబ్రిగుడ : జల జీవన్ మిషన్ తో కంద్రు మ్ గ్రామంలో తాగునీటి సౌకర్యం కల్పించడం జరుగుతుందని కంద్రుమ్ పంచాయతీ సర్పంచ్, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు కేహరి చెప్పారు. మండలంలోని కంద్రుమ్ పంచాయతీ లాసేరుగూడ, బైలుగూడ గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ 7.50 లక్షల నిధులతో మంజూరైన సోలార్ గ్రావిటీ పథకాన్ని శనివారం సర్పంచ్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచినీటి సౌకర్యం లేని గ్రామాల్లో సోలార్ గ్రావిటీ పథకం ద్వారా తాగునీటిని కల్పించడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ ఎస్ ఆనంద్, వార్డు సభ్యులు పీ లచ్చన్న, బలరాం, నాయకులు శ్రీనివాసరావు, గోపి, మోహన్, గ్రామస్తులు ఎస్ హరి బలరాం ఇంజనీర్ అసిస్టెంట్ నాని గ్రామ వాలంటీర్లు కుమాన్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

దిగ్విజయంగా క్లిష్టమైన శస్త్ర చికిత్స

విశాలాంధ్ర - రంప చోడవరం : రంప చోడవరం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్ వైద్యులు కె.సుధాకర్ క్లిష్టమైన శస్త్ర చికిత్స ను నిర్వ హించారు. ఇటీవల బైక్ ఆక్సిడెంట్ లో ఎడమ కాలు మోకాలు వద్ద రెండుగా ఇరిగిపోయిన కాలును శస్త్ర చికిత్స తో కాలును ఏకంచేశారు. అరుదైన ఘనతను సాధించిన వైద్యులను ప్రతి ఒక్కరు అభినందిస్తున్నారు. రంప చోడవరం మండలం బోలగొండ కు చెందిన వెంకట రెడ్డి ఇటీవల బైక్ ఆక్సిడెంట్‌లో ఎడమ కాలు జాయింట్ వద్ద రెండుగా ఇరిగిపోయింది.

ఇతర యూనివర్సిటీలకు మార్గదర్శకంగా ఏయూ

విశాలాంధ్ర - విశాఖ సిటీ : ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని గత నాలుగున్నర సంవత్సరాలుగా ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అభివృద్ధి చేసిన విధానం అభిలషణీయమని రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రా రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఏయూను సందర్శించి మాట్లాడుతూ ఏయూ సాధించిన అభివృద్ధి స్పష్టంగా దర్శనమిస్తోందని, ఇది ఇతర విశ్వవిద్యాలయాలకు మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. నాక్ పర్యటన సందర్భంగా 3.74 స్కోర్ సాధించడం రాష్ట్ర ముఖ్యమంత్రికి అత్యంత ఆనందాన్ని కలిగించిందన్నారు. అన్యాక్రాంతమైన కోట్లు విలువచేసే ఏయూ భూములను స్వాధీనం చేసుకోవడం అసాధారణ విషయమని, దీనికి తాను ఏయూ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డిని అభినందిస్తున్నానన్నారు. ఇది ఏయూ పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతకు అద్దంపడుతుందన్నారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ ఏయూలో విద్యార్థులకు ఉపయుక్తంగా మైదానాలను అభివృద్ధి చేసామని, వందకు పైగా చారిత్రక భవనాలను పునరుజ్జీవనం చేయడం, వర్సిటీలో అకడమిక్ అట్మాస్ఫియర్ను పెంపొందించడంలో చేసిన వివిధ కార్యక్రమాలను తెలయజేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్, ఓఎస్ ఆచార్య వి. కృష్ణమోహన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల పట్టాలు పంపిణీ

విశాలాంధ్ర - పాయకరావుపేట : మండలంలోని పెంటకోట గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ళ స్థలాల పట్టాలను జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, వైసిపి పాయకరావుపేట మండల అధ్యక్షులు చిక్కాల రామారావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చేపల తాతాజీ, ఈఓపీఆర్‌డి చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి వై.సత్యనారాయణ, విఆర్ఓ రాజేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగన్ పాలన ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

విశాలాంధ్ర - పెందుర్తి : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ రంగాలను రెండు కళ్లుగా భావించి ఆదర్శప్రాయమైన పాలన సాగిస్తున్నారని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ పేర్కొన్నారు. జీవిఎంసి నిధులు 3.96 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంఖుస్థాపనలు చేసారు. జీవిఎంసీ 93 వ వార్డులో ప్రహారీ నిర్మాణం, 95 వ వార్డులో కంపోర్టు రోడ్డు నిర్మాణం, 96వ వార్డులో పోలీస్ స్టేషన్ సమీపంలో రోడ్డు, వెంకటాద్రిపైకి నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ అభివృద్ధి పథకాలు అమలు అవుతు న్నాయని పేర్కొన్నారు. వెంకటాద్రి ప్రధానార్చకులు మోర్త రామానుజాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయించారు. కార్యక్రమంలో జీవీఎంసీ 93 వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే గొల్ల బాబురావు

విశాలాంధ్ర - యస్. రాయవరం : మండలంలో గుడివాడ పంచాయతీలోని నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం రైతు భరోసా కేంద్రం వెల్నెస్ సెంటర్ లను పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబురావు చేతుల మీదుగా ప్రారంభించారు. గ్రామంలోని భవనాలు నిర్మాణం పూర్తి చేసుకోవడంతో ఈ భవనాలను ఎమ్మెల్యేతో పాటు పాయకరావుపేట నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు ప్రారంభించడం జరిగింది. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మంచి పాలన అందించాలని ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి ముఖ్య ఉద్దేశం అని ఎమ్మెల్యేలు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జడ్పిటిసి కాకర దేవి, ఎంపీపీ కోన లోవ లక్ష్మి, వైస్ ఎంపీపీలు బొలిశెట్టి గోవిందరావు, చోడిపల్లి అప్పన్న, స్థానిక సర్పంచ్ దూళి శ్రీను బాబు, వైసిపి జిల్లా కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, పోలిశెట్టి పెద ఈశ్వరరావు, మధు వర్మ, శ్రీపతి రాజు, నీలాంధ్ర రావు పాల్గొన్నారు.

ఉచిత కరెంటు పేరుతో నిలువు దోపిడి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

ఆదివాసులకు ఉచిత విద్యుత్ అందించాలి : సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర - అల్లూరి జిల్లా పాదేరు : రాష్ట్ర ప్రభుత్వం ఉచిత కరెంటు పేరుతో ఒకేసారి నిలువు దోపిడీ చేస్తుందని సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి అమర్,కూడ రాధా కృష్ణ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, వైసిపి ప్రభుత్వం డంకా బజాయించి ఆర్బటంగా ప్రచారం చేస్తు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని గొప్పలు చెప్తుందని, కొంత కాలంగా మైనస్ బిల్లులతో ఆదివాసులకు మోసం చేస్తూ, ఒకేసారి వెయ్యి రూపాయల నుంచి 5 వేల రూపాయలు 10 పదివేల రూపాయలు వరకు ఆదివాసులపై విద్యుత్ బిల్లుల భారం మోపుతున్న పరిస్థితి నేడు ఆదివాసి ప్రాంతాల్లో ఉందన్నారు. మైనస్ బిల్లులు వస్తూ ఒకేసారి వేల రూపాయల్లో విద్యుత్ బిల్లు రావడంతో విద్యుత్ బిల్లులు ఆదివాసులు కట్టుకోలేక ఆర్థిక స్తోమత లేక లబోదిబోమంటున్న పరిస్థితి ఆదివాసి ప్రాంతంలో నేడుఉందన్నారు. ఆదివాసులకు ఉచిత విద్యుత్ పేరుతో ఒకేసారి దోపిడీకి పాల్పడటం సరైనది కాదని, ఆదివాసులకు ఉచితంగా విద్యుత్ అందించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యుత్ బిల్లులు వేల రూపాయలలో వచ్చిన వారితో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణరావు, అఖిల్, రావణ్ తదితరులు పాల్గొన్నారు.

రమణయ్య హత్యకు పాల్పడిన వారిన అరెస్టు చేయాలి : సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ళ

విశాలాంధ్ర - విశాఖ : విశాఖ రూరల్ మండల తహశీల్దార్ రమణయ్య హత్యను సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు తీవ్రంగా ఖండించారు. సనపల రమణయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలియజేసారు. హత్యకు కారకులైన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేసారు. భూ వివాదాలతో సంబంధాలు ఉన్న కబ్జాదారులందరినీ విచారణ చెయ్యాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మధురవాడ ఏరియాలోనే అత్యధికముగా ప్రభుత్వం భూములు అన్యాక్రాంతమయ్యాయని అన్నారు. కార్యనిర్వాహక రాజధాని అని ప్రకటించి భూకబ్జాదారులకు తలుపులు బార్ల తెరిచారని విమర్శించారు. విశాఖ రూరల్, ఆనందపురం, భీమిలి, సబ్బవరం, పెదగంట్యాడల్లో వైసీపీ నాయకుల అండదండలతో భూకబ్జాదారులు అధికారులను బెదిరించి, భయపెట్టి లొంగదీసుకొని కబ్జాలకు పాల్పడుతున్నారని అన్నారు. తహశీల్దార్ హత్య విశాఖలో శాంతిభద్రతల పరిస్థితికి నిదర్శనమని అన్నారు. దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రశాంత విశాఖను వైసీపీ పాలనలో ల్యాండ్ మాఫియాకు అడ్డగా మార్చేశారని దుయ్యబట్టారు. హత్యకు దారితీసిన కారణాలును సమగ్రంగా దర్యాప్తు చేసి నిజానిజాలు ప్రజలకు తెలియచేయాలని డిమాండ్ చేశారు.

రైతు ద్రోహిగా జగన్ మిగిలిపోతాడు : మాజీ మంత్రి బండారు

విశాలాంధ్ర - కే కోటపాడు : ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 1650 కోట్ల రూపాయలు కేటాయిస్తే జగన్ ప్రభుత్వంవచ్చిన తర్వాత ఆ పథకాన్ని పక్కన పెట్టి చరిత్రలో రైతు ద్రోహుగా మిగిలి పోయాడని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆరోపించారు. ఈనెల 5వ తేదీన తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు గొండు పాలెం గ్రామంలో రా కదిలిరా బహిరంగ సభ ఏర్పాట్లు పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. ఈ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఒక ప్రభుత్వ విప్ ఉండి కూడా ప్రాజెక్టుల అభివృద్ధికి ఒక నయా పైసా కూడా ఖర్చు పెట్టలేదు అని అన్నారు. ఐదవ తేదీన చంద్రబాబు నాయుడు ఉదయం 10 గంటలకు గుండుపాలెం గ్రామంలో హెలికాప్టర్ దిగుతారని అన్నారు. సాయంత్రం ఏలూరు దగ్గర చింతలపూడి సభల్లో ఆయన పాల్గొంటారని అన్నారు. ప్రజలంతా ఉదయం 9 గంటలకే సభాస్థలికి చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. పార్లమెంటరీ నియోజకవర్గ సభలో పూర్తయిన తర్వాత చంద్రబాబు నాయుడు పవన్ కళ్యాణ్ ఉమ్మడిగా కలిసి మూడు ప్రాంతాల్లో రీజనల్ సమావేశాల్లో పాల్గొంటారని బండారు వివరించారు. మాడుగుల నియోజకవర్గంలో పీవీ జి కుమార్ మాజీ ఎమ్మెల్యే గవరెడ్డి రామానాయుడు మహిళా ప్రసాద్ రావులు సంయుక్తంగా కలిసి సభ విజయవంతానికి కృషి చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఎమ్మెల్సీ చిరంజీవి రావు మాజీ ఎమ్మెల్యే జిఎస్ఎన్ రాజు , తదితర నాయకులు పాల్గొన్నారు. 35

9న తెప్పోత్సవం



విశాలాంధ్ర - సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం సింహాద్రినాధుని తెప్పతిరునాళ్ళు (తెప్పోత్సవం) ఈనెల 9వ తేదీన జరుగ నున్నట్లు ఇఓ ఎస్. శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈ వేడుకను అత్యంత వైభవంగా నిర్వ హించేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. సింహాద్రి అప్పన్న జలవిహారం చేసే హంస వాహనాన్ని అందంగా అలంకరిస్తామని , ముందస్తుగా హంస వాహనం ట్రైల్ రన్‌ను కూడా నిర్వహించనున్నట్లు ఈఈ శ్రీనివాసరాజు, ఈఈ2 రాంబాబు పేర్కొన్నారు. పుష్యబహుళ అమావాస్య సంధర్బంగా నాడు సాయంత్రం గం.3.35నిలకు స్వామివారు మెట్ల మార్గం వెంబడి కొండక్రింద వరాహ పుష్కరిణి వద్దకు చేరుకుంటారు. అనంతరం పుష్కరిణి వద్ద ప్రత్యేక పూజలు అనంతరం స్వామివారు తన ఉభయ దేవేరులతో కలసి పుష్కరిణి మధ్య ఉన్న మండపం చుట్టూ 3మార్లు తెప్ప తిరునాళ్ళు చేసి మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకుని తిరిగి ఒడ్డుకు చేరుకుంటారు. అనంతరం గ్రామతిరువీధిలో ఊరేగి భక్తులకు తన దివ్యాశీస్సులు అందిస్తారని తెప్పోత్సవం సంధర్బంగా వేడుకలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉందని, దీంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అవాంఛనీయ సంఘటనలు కలుగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఈఓ తెలిపారు.

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ 91, 92 వార్డులలో అర్హత ఉండి సాంకేతిక ఇబ్బందుల వలన ప్రభుత్వం ద్వారా పెన్షన్ రాని వారికి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ కు విన్నవించగా ఆనంద్ కుమార్ సొంత నిధులతో 91వ వార్డు పాత గోపాలపట్నం, ఎస్సీ కాలనీ బాజీ జంక్షన్ లలో ఉప్పాటి హిమ, శైలజ బర్ల జగదీశ్వరరావు ఐక లక్ష్మి గొందేసి కనకమ్మ కటిక పార్వతి కుమార్ లాల్ సురేష్ ఉత్తడ కృష్ణ మొలకపల్లి లక్ష్మి లకు ఒక్కొక్కరికి మూడు వేల రూపాయల చొప్పున మొత్తం 24,000 రూపాయలు 92 వ వార్డు ఇందిరానగర్ ఆర్.ఆర్. వి. పురం, గణేష్ నగర్, నరసింహ నగర్ లలో ఉప్పాడ అప్పారావు, సిరిమల్లె శంకర్రావు, గంట లక్ష్మి,ఎలమంచిలిశ్రీనివాసరావు, గంటల రమ్య, యాండ్ర పార్థవర్ధన్, బెహరా సాయికుమార్, బెహరా శివ ప్రియ లకు 21,500 రూపాయలను 91 వ వార్డు అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు, 92 వ వార్డు అధ్యక్షులు జి అప్పలస్వామి నాయుడు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో పొట్నూరి శంకర్రావు, బల్లంకి వెంకట్రావు, కడితి రాజు, తంబి రెడ్డి, పలివెల శంకర్రావు, పలివెల రాము, నాగేశ్వరరావు, అర్జున్, ఉప్పాడ శ్రీను వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న పాలనతోనే రాష్ట్రం మరింత అభివృద్ధి : ఉపముఖ్యమంత్రి బూడి

విశాలాంధ్ర - చీడికాడ : జగనన్న పాలనతోనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు మండలంలోని చెట్టుపల్లి చుక్కపల్లి దిబ్బపాలెం చీడికాడ ఖండి వరం కోణం గ్రామాలలో ఇటీవల నూతనంగా నిర్మించిన రోడ్లు సచివాలయాలు హెల్త్ సెంటర్లు రైతు భరోసారోసా భవనాలను ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పథకాలు ఎలా ఇచ్చారో రాష్ట్రాన్ని అలాగే అభివృద్ధి చేశారన్నారు రాజకీయలకు అతీతంగా ప్రజలకు పథకాలు అందించామని అన్నారు రానున్న రోజుల్లో మరిన్ని పథకాలు అందుకోవాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్ళీ జగన్ మోహన్ రెడ్డిని సీఎం గా చేసేందుకు మాకు మీ ఆశీర్వాదాలు ఇవ్వాలని కోరారు ఈ కార్యక్రమంలో జడ్పిటిసి లాలం శారదవరలక్ష్మి వైకాపా మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు ఎంపీపీ కురచా జయమ్మ కూరచా నారాయణమూర్తి లాలం జానకిరామ్ యూత్ కన్వీనర్ స్వామి నాయుడు వైస్ ఎంపీపీలు స్వాతి చిన్నమ్మలు సర్పంచ్‌లు ఉమా లక్షణమ్మ దేవానందం ఎంపీడీవో ఉమామహేశ్వరి ఇతర శాఖలకు చెందిన అధికారులు నాయకులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని గత ఏడాది భారీ వర్షాలు వరదలు కారణంగా మండల వ్యాప్తంగా ఉన్నటువంటి రోడ్లు అధ్వానంగా మారాయని ఏ గ్రామానికి వెళ్లిన రోడ్లు గోతులు దర్శనం ఇస్తున్నాయనిరోడ్ల నిర్మాణానికి తక్షణమే నిధులను మంజూరు చేయాలని కోరుతూ చింతూరు ఐటిడిఏ పిఓ కావూరి చైతన్యకు వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని శనివారం మండల సిపిఎం నాయకులు ప్రజా ప్రతినిధులు వినతి పత్రాన్ని అందజేశారు. మండలంలో నెలకొని ఉన్న పలు సమస్యలు పిఓకు నాయకులు వివరించారు. మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా ఉన్న శ్రీరామగిరి గ్రామంలో మంచి నీటి సమస్య తలెత్తకుండా శాశ్వత మార్గం చూపి నిరంతరాయంగా మంచినీరు సరఫరా కు చర్యలు తీసుకోవాలని కోరారు. పై సమస్యలు పరిష్కారానికి పిఓ సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని నాయకులకు పిఓ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం లక్ష్మి సర్పంచ్ లు పూనెం సరోజినీ,వెట్టి లక్ష్మి, పులి సంతోష్ కుమార్ సవలం మారయ్య కారం బుచ్చమ్మ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెమ్ సత్యనారయణ మండల కార్యదర్శి సోయం చినబాబు, నాయకులు గుండెపూడి లక్ష్మణరావు ,వడ్లాది రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణ భారతి స్టేడియంను ఆధునీకరించండి

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : జీవీఎంసీ జోన్ 3 నందు స్వర్ణ భారతి స్టేడియం ను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఆధునికరించి స్పోర్ట్స్ ఎరీనా గా అభివృద్ధి పరిచి ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ముందుగా స్టేడియంను సందర్శించి జరుగుచున్న పనులను పరిశీలించారు. అక్కడ ఉన్న టెన్నిస్ కోర్టును పూర్తిగా ఆధునికరించి వెంటనే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. మహా విశాఖ నగరంలో రానున్న రోజుల్లో జరుగబోవు అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలకు అనుగుణంగా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అన్ని సదు పాయాలతో స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంను ఆధునీకరించి అభివృద్ధి పరచాలని పర్యవేక్షక ఇంజనీర్ వినయ్ కుమార్ ను కమిషనర్ ఆదేశించారు. స్టేడియం నందు పచ్చదనం, వీక్షకుల గ్యాలరీ, లైటింగ్ , ఫ్లోరింగ్, ఏసీ, టాయిలెట్స్ తదితర మౌలిక సదుపాయాలతో అందంగా తీర్చిదిద్ది త్వరితగతిన అన్ని పనులను పూర్తి చేసి స్టేడియం ను వినియోగం లోనికి తీసుకురావాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎసిపి రఘునాథ్, స్పోర్ట్స్ డైరెక్టర్ హనుమంతరావు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ ప్రసాద్, అసిస్టెంట్ స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు పాల్గొన్నారు.

యోగ టీచర్ ట్రైనింగ్ సర్టిఫికేట్ కోర్స్ ప్రారంభం

విశాలాంధ్ర - చోడవరం : విశాఖపట్నం యోగ భారతి ట్రస్ట్ మరియు చోడవరం, అనకాపల్లి పతంజలి యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో డిపార్ట్మెంట్ ఆఫ్ ఆయుష్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సర్టిఫికెట్ బోర్డు ఆధ్వర్యంలో యోగ మాస్టర్ గా మరియు టీచరుగా రాణించాలనుకుంటున్న యువతీ యువకులకు మంచి అవకాశమని యోగ గురువు పుల్లేటి సతీష్ తెలిపారు. ఈ సర్టిఫికెట్ ద్వారా ప్రైవేటు కాలేజీల్లో ఇంటర్నేషనల్ స్కూల్ లో యోగా టీచర్ గా ఉద్యోగ అవకాశం పొందవచ్చునని, భారత ప్రభుత్వం ఆయుష్ డిపార్ట్మెంట్ లో కూడా ఉద్యోగ అవకాశాలు పొందవచ్చునని తెలిపారు. అలాగే సొంతంగా యోగ కేంద్రాన్ని స్థాపించుకోవచ్చునని తెలుపుతూ మరిన్ని వివరాలు కొరకు 9291276900 మొబైల్ నెంబర్ ను సంప్రదించవలసిందిగా అనకాపల్లి జిల్లా యోగా అసోసియన్ ప్రెసిడెంట్ పుల్లేటి సతీష్ తెలిపారు.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

విశ్వకర్మ పథకం చేతి వృత్తుల వారికి వరం : జిల్లా పరిశ్రమల అధికారి శ్రీకాంత్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : కేంద్ర ప్రభుత్వం చే అమలు చేయబడుతున్న ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం చేతివృత్తుల కళాకారులకు మంచి వరమని జిల్లా పరిశ్రమల అధికారి జీఎం శ్రీకాంత్ తెలిపారు. శనివారం వి.వి.రమణ రైతు భారతి కేంద్రం లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ. పూర్వకాలం నుంచి కొనసాగుతూ వస్తున్న కళా నైపుణ్యాలకు మరింత మెరుగులు దిద్ది వారి కుటుంబాలకు తద్వారా భారతీయ సంస్కృతికి ప్రపంచ ప్రఖ్యాతి విశ్వకర్మ కార్యక్రమం రూపొందించ బడిందన్నారు అంతే కాకుండా సాంప్రదాయ కళా కారులకు ఆర్థిక చేయూతనివ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ ఉంటుందని ఐదు నుండి ఏడు రోజులపాటు 500 స్టైఫండ్ ఉంటుందన్నారు. డిజిటల్ సేవ కార్డుతో ఆన్లైన్ లో నమోదు చేసుకోవచ్చని దానికి జిల్లా అమలు కమిటీ ఆమోదముద్ర వేస్తుందని చెప్పారు. ఎం.ఎస్.డి.ఈ. డిఎఫ్ఎస్, ఎంఎస్ఎంఈ, బ్యాంకు తదితర అధికారులతో కూడిన కమిటీ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని 18 గుర్తించబడిన సాంప్రదాయ వ్యాపారాలలో ఉన్న కళాకారులు, అర్హులందరూ వినియోగించవలసిందిగా ఆయన పిలుపునిచ్చారు. డిఎల్ డివో మంజులవాణి మాట్లాడుతూ ఈ పథకంలో ఎంతమందైనా రిజిస్టర్ కావచ్చని కమ్మరి కుమ్మరి వడ్రంగి కంసాలి టైలరింగ్ సాంప్రదాయక ఆట బొమ్మల రూపకర్తలు తాపీ పనివారు గంపలు తయారీ వారు చర్మకారులు క్షురకులు మత్స్యకారులు రజకులు మొదలైన వృత్తుల వారు నమోదు చేయించుకోవచ్చు అన్నారు. ఎమ్మెస్ఎంఈ కోఆర్డినేటర్ ఏడి ఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ. విశ్వకర్మ పథకం ఉద్దేశాలు విధి విధానాలను గూర్చి వివరించారు. భార్య భర్త అవివాహిత పిల్లలు సభ్యులు గల కుటుంబంలో ఒకరికి మాత్రమే పథకం వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి శచీదేవి, డిపిఓ శిరీష రాణి లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వరరావు, ఏటి డబ్ల్యు ఓ నాగ శిరీష, డొమైన్ నిపుణులు నాగేశ్వరరావు పరమేశ్వరరావు విశ్వ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు గంగారాం పట్టణ అధ్యక్షుడు కోటిపల్లి జేజిబాబు సిఎస్సి హెడ్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ కాదు - దగాడి ఎస్సి : మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

విశాలాంధ్ర - అల్లూరి జిల్లా పాడేరు : జగన్ రెడ్డి వదిలింది మెగా డీఎస్సీ కాదు...దగా డీఎస్సీ అని పాడేరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు శనివారం ఆమె నివాస గృహమందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గిరిజనులకు గుండెకాయ లాంటి జీవో నెంబర్ 3 కొట్టివేస్తే కనీసం రివ్యూ పిటిషన్ వైసిపి పాలకులు వెయ్యలేక పోయారని తెలుగుదేశం ప్రభుత్వ అధికారంలోకి వస్తే జీవో నెంబర్ 3 మళ్ళీ పునర్దిస్తామని ఆమె అన్నారు. 50,892 ఖాళీలుంటే, 6,100 పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగుల్ని వంచించడ మేనాని, డీఎస్సీ పేరుతో ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకొనే జగస్ రెడ్డి కొత్త డ్రామాకు తెర తీశారన్నారు. జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని నాలుగన్నరేళ్లు జగన్ చేసింది ఏం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో 50,892 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను గుర్తించిందని, ఇప్పుడు జగన్ రెడ్డి కేవలం 6,100 ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. నిరుద్యోగుల ఆశలపై నీళు చల్లేలా బొత్సా కల్లబొల్లి మాటలు చెప్తున్నారు. కల్తీ మద్యం అమ్మకాలతో మద్యాంధ్ర ప్రదేశ్‌గా.... గంజాయి ఉత్పత్తిలో నంబర్ వన్‌గా రాష్ట్రాన్ని చేసి గంజాయాంధ్రప్రదేశ్ గా మార్చిన ఘనత జగన్ రెడ్డిదేన్నారు. రాష్ట్రంలో ఉంటే గంజాయి.. కల్తీ మద్యం తాగి సైకోలు అవుతామన్న భయంతోనే యువత ఉపాధి కోసం పొరుగు రాష్ట్రాలకు వలస పోతున్నారన్నారు. అధికారా వైకాపా నేతల కనుసందుల్లో రాష్ట్రంలో గంజాయి విచ్చల విడిగా స్మగ్లింగ్ జరుగుతోందన్నారు. గిరిజన ప్రాంత యువతీ యువకులు ఓటుతో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో చిట్టిబాబు సింహాచలం రమేష్ నాయుడు కుమారి సంజీవరావు మోహన్ రావు సత్యనారాయణ రాజ్ కుమార్ సురేష్ రామారావు రవి ప్రసాద్ విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ నుంచి కౌలాలంపూర్‌కు విమానాలను ప్రారంభించిన ఎయిర్ ఏషియా

విశాలాంధ్ర - విశాఖ సిటీ : విమాన యాన రంగ ప్రముఖ సంస్థ ఎయిర్ ఏషియా తన వ నెట్‌వర్క్‌ను భారతదేశం నుండి మలేషియాకు వ్యాపింప చేస్తూనే ఉంది. అందులో భాగంగా తాజాగా... విశాఖపట్నం నుంచి కౌలాలంపూర్‌కు తిరిగి విమానాలను ప్రారంభించినట్లు ప్రకటించింది. కౌలాలంపూర్ నుంచి విశాఖపట్నానికి డైరెక్ట్ ఫ్లైట్ సేవలు అందిస్తున్న ఏకైక విమానయాన సంస్థ ఎయిర్‌ఏషియా కావడం విశేషం అని ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. ఎయిర్‌ఏషియా 2024 ఏప్రిల్ 26 నుంచి విశాఖ పట్నం నుండి మలేషియా రాజధాని కౌలాలంపూర్‌కు వారానికి మూడు సార్లు విమా నాలను నడపబోతుందన్నారు. కౌలాంలపూర్ కు తిరిగి విమాన సర్వీసులు పునరిద్ధరించినందుకు గుర్తుగా... విశాఖపట్నం నుండి కౌలాలంపూర్‌కి విమాన బుకింగ్ 14 ఫిబ్రవరి 2024 వరకు కేవలం రూ4,999 ప్రారంభ ధరతో బుక్ చేసుకోవచ్చన్నారు. అలాగే కౌలాలంపూర్ నుండి కేవలం ఆర్ఎం199 తో బుక్ చేసుకోవచ్చునని, ఇది 26 ఏప్రిల్ 2024 నుంచి 19 మార్చి 2025 మధ్య ప్రయాణం కోసం మాత్రమేనని ఎయిర్‌ఏషియా ఏవియేషన్ గ్రూప్ చైర్మన్ బో లింగం తెలిపారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

విశాలాంధ్ర - రాజవొమ్మంగి : రాజవొమ్మంగి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్ సన్యాసి నాయుడు, రాజవొమ్మంగి ఎస్ఐ వెంకయ్య రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ పరిధిలో గల లాగరాయి, కింద్ర, తాళ్లపాలెం, మర్రిపాలెం, బడదనాంపల్లి, రాజవొమ్మంగి,అనంతగిరి గ్రామాల్లో గల పోలింగ్ బూత్ లకు వాడే ప్రభుత్వ పాఠశాలలలో మంచినీరు, కరెంట్,ప్రహరీ, రోడ్లు, మొబైల్ నెట్ వర్క్ మొదాలగు విషయాలను పరిశీంచారు. అదేవిదంగా సమస్యత్మక గ్రామల వివరాలు తెలుసుకోవటం జరిగింది. రాబోయే ఎన్నికలకు ప్రజలందరూ సహకరించాలని కోరారు.

పభుత్వ వైన్ షాపుల సూపర్ వైజర్లతో సమీక్ష

విశాలాంధ్ర - కశింకోట : మండలంలోని ప్రభుత్వ వైన్ షాపుల సూపర్ వైజర్లకు, వాచ్ మెన్‌లకు సిఐ వినోద్ బాబు పోలీస్ స్టేషన్లో శనివారం సమావేశ పరిచారు. ఈ సందర్భంగా, సీఐ మాట్లాడుతూ మీరంతా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో దొంగతనాలు జరగ కుండా అప్రమత్తమై ఉండాలని సూపర్వైజర్స్ సెక్యూరిటీ గార్డ్‌లకు సూచించారు. గతంలో మండలంలోని కన్నూరు పాలెం వైన్ షాప్ లో దొంగతనం జరిగిందని అలాంటివి జరగకుండా మీరు జాగర్తగా ఉండాలి అని తెలిపారు. బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. రాత్రి 10 గంటలకు షాప్ క్లోజ్ చేసే ముందు ప్రతి ఒక్కరు కూడా వాట్సాప్ పెట్టాలని సిబ్బంది అంత పోలీసులతో వాట్సప్ గ్రూప్ తయారు చేసి ప్రతిరోజు సమాచారం ఇవ్వాలని అన్నారు.

58వ వార్డులో ఆడారి ఆనంద్ కుమార్ సొంత నిధులతో నిరుపేదలకు పించన్ల పంపిణీ

విశాలాంధ్ర - మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతం పరిధి 58 వ వార్డు లో ఆడారి ఆనంద్ కుమార్ సొంత నిధులతో నిరు పేదలకు పెన్షన్లు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమం మాన్ని వార్డ్ అధ్యక్షులు దాట్ల శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నాయకులు సమక్షంలో పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షులు దాట్ల శ్రీనివాస రాజు మాట్లాడుతూ సేవా దృక్పథం కలిగిన మానవతావాది ఆడారి ఆనంద్ కుమార్‌లిని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మన నియోజకవర్గం నుంచి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ, ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలపరుస్తూ సొంత నిధులతో ఎంతో మంది పేదలను సొంత నిధులతో విద్యా ,వైద్యం, ఆరోగ్యం నిరుపేదలకు సామాజిక సామాజిక పింఛనులు వంటి ఎన్నో కార్యక్రమాలతో ఆదుకుంటున్న లిఆనంద్‌లి గారిని గెలిపించాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో జె.సి.ఎస్ క్లస్టర్ కన్వీనర్ పిళ్లా కన్నబాబు తో సీనియర్ నాయకులు పాటు గొందేసి పెద్ద సత్యనారాయణ రెడ్డి, బెల్లంకొండ వరహాలు, బి సాల్మన్ రాజు, గొందేసి చిన సత్యనారాయణ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, పిట్ట అప్పల రెడ్డి,ముకుంద్, ఉరుకుటి కన్నబాబు, కోటా కృష్ణ, కోటా సుబ్బలక్ష్మి, సిరిపురం సత్యవతి, డి.రామారావు, చుక్క అది బాబు, స్మాల్ అప్పల రెడ్డి 58వ వార్డు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజారావు

విశాలాంధ్ర - దుంబ్రిగుడ : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్క కార్యకర్త గ్రామాల్లో వెళ్లి ప్రజల్లో చైతన్యం చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు వి.రాజారావు పిలుపునిచ్చారు. మండలంలోని కించమండలో అపార్టీ మండల అధ్యక్షుడు కే.రమేష్ ఆధ్వర్యంలో కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో రోడ్లు గృహ నిర్మాణాలుతో పాటు పలు రకాల పథకాలను అమలు చేస్తుందన్నారు. ప్రస్తుతం పివిటిజి గిరిజనులకు ప్రతి ఒక్కరికి నివాస గృహాలను మంజూరు చేస్తుందని, వాటిపై ప్రతి ఒక్కరూ పివిటిజి గ్రామాల్లో కెళ్ళి అవగాహన కల్పించి ఆ పథకంపై అర్హులైన గిరిజనులకు అందే విధంగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు బి. మూర్తి అరకు అసెంబ్లీ కన్వీనర్ బి. ధర్మరాజు, సాగర ఎంపిటిసి వి దేవదాస్, అరకులోయ మండల అధ్యక్షుడు రామ్ చందర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం తహసీల్దారుగా మురళీమోహనరావు



విశాలాంధ్ర - మాకవరపాలెం : మండల తాహసిల్దార్‌గా బి.మురళీమోహన్ రావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు అనంతరం రెవెన్యూ ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఇప్పటివరకు తాహసిల్దారుగా పనిచేసిన ప్రసాద్ రావు శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు.

92 మంది రోగులకు నేత్ర పరీక్షలు

విశాలాంధ్ర - కశింకోట : కశింకోట పదవీ విరమణ ఉద్యోగుల సంఘం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర పరీక్ష శిబిరం నిర్వహించబడినది. డాక్టర్ ఊర్వశి సింగ్ మరియు దేశ్ముఖ సమృద్ధి , కంటి రోగులకు నేత్ర పరీక్ష చేశారు. శంకర్ ఫౌండేషన్ మేనేజర్ ఎం చంద్రశేఖర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు. 92 మంది రోగులకు నేత్ర పరీక్ష చేశారు.14 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు.16 మందికి కళ్ళద్దాలు సిఫారసు చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు పాము సూర్య నారాయణ, ప్రధాన కార్యదర్శి కె గోపాలరావు, కార్యదర్శి నంబా రమణ, కె కామేశ్వరరావు, కరణం సూర్య ప్రకాష్ రావు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మానవత్వం చాటి చెప్పిన చోడవరం పోలీసన్న

విశాలాంధ్ర - చోడవరం : పోలీసులు రక్షణకే కాదు మానవ త్వంలోనూ మేము ఉన్నామని చాటి చెప్పారు చోడవరం పోలీసులు. చోడవరం బి.ఎన్.రోడ్డు పై శనివారం స్పృహ తప్పి పడి పోయిన ఓ అనాథను రక్షించడంలో పోలీసులు తమ ఔదా ర్యాన్ని చూపించారు. విషయం తెలుసు కున్న పోలీస్ అన్నలు పడిపోయిన అనాధ వ్యక్తిని హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యులు ప్రథమ చికిత్స అందజేసి పక్షవాతంతో రోగి బాధ పడుతున్నాడని మెరుగైన చికిత్స కోసం అనకాపల్లి తరలించవలసిందిగా సూచించారు. తక్షణమే 108 వాహనంలో అనకాపల్లి తరలించిన స్తానిక పోలీసులు తమలోని మానవత్వాన్ని చాటి చెప్పడంతో గ్రామస్థులు పలువురు వారిని అభినందించారు.

కంటి వైద్య శిబిరంను సద్వినియిగం చేసుకోండి

విశాలాంధ్ర - రంపచోడవరం : రామకృష్ణ మిషన్ రాజమండ్రి వారిచే రంప చోడవరం శివారు సిరిగిందల పాడు గ్రామంలో గల రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల లో వైద్య శిబిరం తో పాటు పరమహంస యోగానంద నేత్రాలయం వేమగిరి వారిచే కంటి వైద్య శిబిరం నిర్వహించబడుతుందని రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయ నందజీ మహారాజ్ తెలిపారు.కంటి పరీక్షలు ఉచితంగా చేసి మందులు కళ్లజోళ్లు ఇవ్వనున్నట్టు స్వామిజీ తెలిపారు .ఆపరేషన్ అవసరమైన వారికి పరమహంస యోగానంద నేత్రాలయం వేమగిరి తరలించి ఆపరేషన్ చేయబడుతుందన్నారు.విధిగా తెల్ల రేషన్ కార్డు కూడా తీసుకురావాలని సూచించారు .

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

తహశీల్దార్ మధుసూదనరావు

విశాలాంధ్ర - కశింకోట : 2024 లో జరగబోవు సార్వత్రిక ఎన్నికల ముందుగా 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరు గా నమోదు కావలి అని మండల తహసిల్దార్ ఎల్. మధుసూదన రావు పేర్కొన్నారు. ఇప్పటి వరకు నియోజక వర్గంలో 2,11,072 మంది ఓటర్లు ఉన్నారు అందులో పురుషులు 1,01,818 ,స్త్రీలు 1,9,249 మంది కాగా ఇతరులు 5 మంది ఉన్నారన్నారు. కశింకోట మండలం లో చూస్తే 55,707 మంది ఓటర్లుగా నమోదయ్యారన్నారు. అందులో పురుషులు 26,786 మంది స్త్రీలు 28,920 మంది కాగా ఒకరు మాత్రమే ఇతరులు నమోదు అయ్యారని తెలిపారు. ఎన్నికలకు 71 బూతులు నిర్ణయించామని అన్నారు.

ఈ నెల 10వ తేదీన కాకినాడలో జాతీయ సదస్సు

విశాలాంధ్ర - పాయకరావుపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ పాలన నుండి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రక్షించికుందాం అనే అంశంపై దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 10 వ తేదీన కాకినాడ లోని డాక్టర్ అంబేద్కర్ భవన్ లో జరిగే జాతీయ సదస్సును విజయవంతం చేయాలని దళిత బహుజన పార్టీ రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు దాసరి అన్నపూర్ణ పిలుపునిచ్చారు. స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సీనియర్ దళిత నాయకులు దొమ్మటి శామ్యూల్ అధ్యక్షతన జరిగే సదస్సులో వివిధ ప్రజా సంఘాలకు చెందిన ప్రజాస్వామిక, లౌకిక ఉద్యమం ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు, సుప్రీంకోర్ట్ న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ ప్రధానవక్తగా హాజరవుతారని తెలిపారు. మోడీ, జగన్ పాలన లో దళిత జీవన, మానవ హక్కులు కాలరాసారని, 18 రకాల దళితుల రాజ్యాంగపు అభివృద్ధి పథకాలను రద్దు చేసి, జాతి పురోగతిని అడ్డుకున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో దళిత వ్యతిరేక సర్కార్ లను ఓడించకపోతే జాతికి బానిసత్వం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు దువ్వాడ దావీదు, మాలమహానాడు జిల్లా అధ్యక్షులు తట్టా శ్రీనివాసరావు, పార్టీ పట్టణ కన్వీనర్ చిరుకూరి రమణ, మహిళా అధ్యక్షురాలు బోడపాటి లక్ష్మీ, పార్టీ ఎస్. రాయవరం మండలం ఇంచార్జ్ కశింకోట హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా కంటి క్యాన్సర్ పై అవగాహన



విశాలాంధ్ర - విశాఖ సిటీ : ఈ నెల 4వ తేదీ ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా విశాఖ హెల్త్ సిటీ దరి జిఎంఆర్ వరలక్ష్మీ ప్రాంగణంలోని ఎల్.వి. ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో కంటి క్యాన్సర్ పై అవగాహన కార్య క్రమం నిర్వహిస్తున్నట్టు ఆ ఆసుపత్రి స్పెషలిస్ట్, క్యాంపస్ హెడ్ డాక్టర్ వీరేందర్ సచ్ దేవ్ వెల్లడించారు. మూడు ఏళ్ల లోపు పిల్లలలో సంభవించే రెటోనోబ్లాస్టోమా కంటి క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించు కార్యక్రమం నిర్వహిం చమన్నారు. రెటో నోబ్లాస్టోమా కంటి క్యాన్సర్ అత్యంత ప్రాణాంతకమైనదని, పిల్లల దృష్టికి ప్రమాదం కలిగి స్తుందన్నారు. పిల్లల కంటిలో తెల్లని ప్రతిబింబం కంటి క్యాన్సర్ కు సంకేతం కావచ్చునని, అటువంటి పరిస్థితి కనిపిస్తే వెంటనే నేత్ర వైద్య నిపుణులను సంప్రదించాలన్నారు. వీలైనంత త్వరితంగా దీనికి చికిత్స చేయటం కీలకమైనదని, ఈ కంటి క్యాన్సర్ గురించి అవగాహన తక్కువ కావటం వలన భారతదేశంలో పిల్లలలో ఏటా 1500 కొత్త కేసులు బయట పడుతున్నట్లు నివేదికలు తెలుపుతు న్నాయన్నారు. ఈ క్యాన్సర్ కేసులలో అధిక భాగం చివరి దశలో గుర్తించటం మరియు సకాలంలో సరియైన చికిత్స అందించక పోవటం కారణంగా 50 శాతం యువత ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు.

ముస్లింలకు టికెట్ ఇచ్చే పార్టీనే గేలిపిస్తాం : మక్కా మసీదు అధ్యక్షుడు షేక్ మున్నీర్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : విశాఖపట్నం లో ముస్లింలకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని మక్కా మసీదు అధ్యక్షుడు షేక్ మున్నీర్ కోరారు. నగరంలో గల పది మసీదులకు చెందిన ముస్లిం వర్గానికి చెందిన నేతలు డాబా గార్డెన్స్ వి జే ఎఫ్ ప్రెస్ క్లబ్, లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. షేక్ మున్నీర్ మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర లో 34 అసెంబ్లీ స్థానాలు వున్నాయి. 1994 లో ఎస్.ఏ. రెహమాన్ ను గెలిపించాము అన్నారు. విశాఖలో 1972 లో కూడా ముస్లిం నేత గెలిచారు అని గుర్తు చేశారు. జిల్లా జనాభాలోరెండో స్థానంలో వున్నా సరే చట్ట సభల్లో సరైన ప్రాతినిధ్యం లేదని విచారం వ్యక్తం చేశారు. ముస్లింల సమస్యల పరిష్కారం కోసం చట్ట సభల్లో ప్రాతినిధ్యం కావాలి అని కోరారు. విశాఖ జిల్లా బాగా అభివృద్ధి చెందింది. జిల్లాలో మూడు లక్షల 50 వేల ముస్లిం జనాభా వుంది. వచ్చే ఎన్నికల్లో ముస్లింలకు టికెట్ ఇచ్చే పార్టీ నీ గెలిపిస్తాం అని పేర్కొన్నారు. ముస్లిం నేత బాబు మాట్లాడుతూ, దక్షిణ, ఉత్తర నియోజక వర్గంల లో ముస్లిం నేతలకు టికెట్స్ ఇవ్వాలి అని కోరారు. దక్షిణ నియోజక వర్గంలో 25 వేల ముస్లిం ఓటర్లు వున్నారు అని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ప్రధాన పార్టీలు ముస్లింలకు టికెట్ ఇవ్వకుంటే, ముస్లిం నేతలను ఇండిపెండెంట్ గా రంగంలో దించే ఆలోచన వుంది అని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలు ముస్లిం లకు అన్యాయం చేస్తు న్నాయి అని ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో 120 మసీదులు వున్నాయి అని గుర్తు చేశారు. రాష్ట్రంలోవిజయ వాడ నుంచి ఇచ్ఛాపురం వరకు ఐదు స్థానాలు గెలిచే సత్తా వుంది అని స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో ముస్లిం నాయకులు సనా వుల్లా, జమీల్ అహ్మద్, అబ్దుల్ రహీమ్, అబ్దుల్ అజీజ్, అహ్మద్ తుల్లా, రవూఫ్, జియ ఉల్ హస్, రహమాన్, పలు మసీదుల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మోటివేషనల్ ప్రోగ్రామ్ నిర్వహణ

విశాలాంధ్ర - భీమిలి : అనిల్ నీరుకొండ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ 1వ మరియు 2వ విద్యార్థుల కోసం అకడమిక్, కెరీర్ మరియు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించే రెండు రోజుల మోటివేషనల్ ప్రోగ్రామ్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమం 2024 ఫిబ్రవరి 2 మరియు 3 తేదీలలో కళాశాల ఆడిటో రియంలో ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు జరిగింది. పారాసైకాలజీలో విశిష్ట పిహెచ్‌డి హోల్డర్ మరియు ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ జగన్నాథరావు ఈ కార్యక్రమానికి గౌరవనీయమైన రిసోర్స్ పర్సన్. డా. రావు నైపుణ్యం విద్యార్థులను అకడమిక్ ఎక్సలెన్స్, కెరీర్ గ్రోత్ మరియు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ నైపుణ్యాల వైపు ప్రేరేపించింది మరియు మార్గనిర్దేశం చేసింది. కార్యక్రమంలో విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు. డాక్టర్ పి.వి. సుధాకర్, అనిల్ నీరుకొండ ఎడ్యుకేషనల్ సొసైటీ డీన్, అనిల్ నీరుకొండ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.వంశీకృష్ణా రెడ్డి ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని తమ విలువైన అవగాహనలను, అను భవాలను పంచుకున్నారు. ఈ చొరవ తమ విద్యార్థులకు సంపూర్ణ అభివృద్ధి అవకాశాలను అందిం చడంలో ఇన్‌స్టిట్యూట్‌ల నిబద్ధతను ప్రతిబింబిస్తుంది, విద్యావేత్తలలో మాత్రమే కాకుండా వారి భవిష్యత్ కెరీర్‌లు మరియు వ్యవస్థాపక ప్రయత్నాలలో కూడా రాణించడానికి వారిని శక్తివంతం చేస్తుంది.

దాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై వాకథాన్

విశాలాంధ్ర - మల్కాపురం : దాన్ ఫౌండేషన్ ప్రతి సంవత్సరం ఏదో ఒక సామాజిక అంశంపై వాకథాన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. దానిలో భాగంగా మల్కాపురం కళంజియ సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం నూతన సామాజిక క్రమం వైపు అనే అంశంపై వాకథాన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వందలాది మంది కళంజియ మహిళలు మరిడిమంభ కళ్యాణ మండపం నుండి ఒక ప్రదర్శనగా , జనతాకాలని దుర్గాదేవి ఆలయం నుండి మరొక ప్రదర్శనగా గౌరీపార్వతి ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు, అనంతరం గౌరీ పార్వతి ఆలయ ప్రాంగణంలో సభ నిర్వహించడం జరిగింది. ముందుగా కళంజిగా మహిళలందరూ "ధర్మం మరియు సమానత్వంపై ఆధారపడిన పేదరికం లేని సమాజాన్ని సృష్టించడానికి అవసరమైన కొత్త సామాజిక క్రమాన్ని రూపొందించడంలో నేను హృదయపూర్వకంగా నా వంతు పాత్రను పోషిస్తాను మరియు పర్యావరణాన్ని పరిరక్షిస్తాను అనే ప్రతిజ్ఞ చెయ్యడం జరిగింది. వైజాగ్ రూరల్ రీజియన్ కొఆర్డినేటర్ కె. రామ్ కుమార్ ,కోస్టల్ కో ఆర్డినేటర్ ధనలక్ష్మి , క్యూర్ ప్రాజెక్ట్ లోకేష్ , జీవనోపాధి కో ఆర్డినేటర్ రజనీ , సమాఖ్య నాయకులు ఆదిలక్ష్మి మరియు అధిక సంఖ్యలో కళంజియ పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు..

వైకాపా ప్రభుత్వంలో హత్యలకు నిలయంగా రాష్ట్రం : గంటా నూకరాజు

విశాలాంధ్ర - భీమిలి : వైకాపా అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. విశాఖ జిల్లా చినగదిలి రూరల్ మండలం తహసీల్దార్ రమణయ్యను ల్యాండ్ మాఫియా ముఠా హత్య చేసిన ఉదాంతం నా మనసుని కలసివేసిందని గంటా నూకరాజు అన్నారు. వివాదస్పదుడుగా, మంచి వ్యక్తిగా, సామాన్యులు సైతం మంచి అధికారి అని ముద్రపడే అధికారిని ఇంత దారుణంగా హత్య చేయడం దారుణమని అన్నారు. ప్రజలకు మంచిచేసి, ప్రభుత్వ ఆస్తులను కాపాడటమే ఆ అధికారి చేసిన తప్పా..? అని అన్నారు. ఈ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఎన్నో హత్యలు జరిగాయని, వాటిని నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ప్యాక్షనిష్టు, సైకో చేతిలో పాలన పగ్గాలు ఉంటే రాష్ట్రంలో పరిస్థితులు ఎలా ఉంటాయో చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటుందని ఆవేదన వ్యక్తం చేసారు. ఒక మండల అధికారి, మండల మేజిస్ట్రేట్ కే ప్రాణాలకు రక్షణ లేకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. కరోనా సమయంలో మాస్క్ లు ప్రభుత్వం ఇవ్వడం లేదని అడిగినందుకు నర్సీపట్నంలో డా. సుధాకర్ ని పిచ్చివాడిని చేసి పరోక్షంగా చావుకు కారణమయ్యారని అన్నారు. ఒక ఎమ్మెల్యే తన కారు డ్రైవర్ని చంపి డెడ్ బాడీని ఇంటికే డెలివరీ చేసినా చలనం లేని ప్రభుత్వంలో ఉన్నామని అన్నారు. ముఖ్యమంత్రి సొంత చిన్నాన్నను హత్య చేసిన నిందితులను తన వెంటవేసుకొని తిరుగుతూ వారికే రక్షణ కల్పిస్తుంటారని అన్నారు. ఇప్పుడు ల్యాండ్ మాఫియా గ్యాంగ్ వారు చెప్పినట్లు చేయలేదని సాక్షాత్ తహసీల్దార్ నే హత్య చేశారంటే ఎంత బరితెగించి ఉన్నారో అర్థం అవుతుందని అన్నారు. ఇంత విధ్వంసం జరుగుతున్నా, ప్రజల ప్రాణాలు గాలిలో కలసిపోతున్నా స్పందించని, చలనం లేని ప్రభుత్వ పాలనలో మనం ఉన్నామా..? అని సిగ్గుతో తలదించుకొనే పరిస్థితి వస్తుందని అన్నారు. ఒకప్పుడు బీహార్ అంటే బయపడేవారని, ఇప్పుడు ఈ రాష్ట్ర ప్రభుత్వం దయవలన బీహార్ ను మించిపోయే ప్రమాదంలో ఉన్నావేమో అనే బయాందోళనలో రాష్ట్ర ప్రజలు ఉన్నారని అన్నారు. ఇన్ని హత్యలు జరుగుతుండడంతో భయానికి లోనవుతున్న ప్రజలకు ఈ రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని అన్నారు. ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకొనే విధంగా తహసీల్దార్ హత్యకు కారకులైన హంతకులను పట్టుకొని కఠినంగా శిక్షంచాలని గంటా నూకరాజు డిమాండ్ చేసారు.

గిరిజనుల హక్కులను కాలరాస్తున్న వైసీపీ, టిడిపి, జనసేన పార్టీలని ఎండగట్టండి

విశాలాంధ్ర - రాజవొమ్మంగి : గిరిజనుల హక్కులు కాలరాస్తున్న కేంద్ర బీజేపీకి మిత్రులుగా ఉన్న వైసిపి, టిడిపి,జనసేన పార్టీలను ప్రజలు ఎండగట్టాలని, గిరిజనుల హక్కుల కోసం, పేద ప్రజలు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం, వారి సంక్షేమం కోసం నిలబడేది ఒక్క ఎర్రజెండా మాత్రమేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వరరావు అన్నారు, మండలంలోని చికిలింత పంచాయతీ దుర్గానగరం గ్రామంలో పార్టీ మండల కమిటీ సభ్యులు పొత్తూరు సత్యనారాయణ అధ్యక్షతన శనివారం సిపిఎం మండల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం సామాన్య, పేద ప్రజలపై, కార్మికులపై మోయలేని భారాలు వేసి వారి నడ్డి విరుస్తుందని, కార్పొరేట్లకు కోట్ల రూపాయలు దారా దత్తం చేస్తుందని విమర్శించారు, ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారాం ప్రవేశపెట్టిన చివరి బడ్జెట్ కూడా కార్పొరేట్ల వికాసం గానే ఉందని విమర్శించారు, కార్పొరేట్ శక్తులకు ట్యాక్స్ రాయితీని కొనసాగించడంలో ప్రత్యేక శక్తి చూపిందన్నారు, ధనికులను మరింత ధనవంతులను చేసి సామాన్య పేద ప్రజలను మరింత పేదలుగా మార్చే దిశగా సాగిందన్నారు, ఆదివాసీలకు బడ్జెట్ కేటాయింపులు తగ్గించి, గిరిజనుల సంక్షేమానికి, గిరిజన ప్రాంత అభివృద్ధికి తూట్లు పొడిచారన్నారు, ఏజెన్సీ ప్రాంతానికి తీవ్ర ద్రోహం చేసిన కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న వైసిపి టిడిపి జనసేన పార్టీ నేతలను గ్రామాల నిలదీయాలని ప్రజల కోసం నిరంతరం పోరాడుతున్న సిపిఎం కు, గిరిజనలు,పేద ప్రజలు, కార్మికులు అండగా నిలవాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కొండ్ల సూరిబాబు,కుంజం జగన్నాథం,రామరాజు, బాబురావు,కె అప్పలరాజు, పాండవుల సత్యనారాయణ, ఎస్ లోవరెడ్డి,పెద్ద సంఖ్యలో పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

అరకులోయ పార్లమెంట్ అభ్యర్థిగా టికెట్ కేటాయిస్తే పోటీకి రెడీ

విశాలాంధ్ర - అరకులోయ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అరకులోయ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా కొరతం ఈశ్వరరావు పేరు ప్రధానంగా వినిపిస్తుందని, వైఎంఆర్సిపి పార్టీ అరుకు ఎంపీ అభ్యర్థిగా 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీలోకి దింపాలని వైసిపి అధిష్టానం చూపు ఈశ్వరరావు వైపు మొగ్గు చూపిస్తున్నట్లు వైసిపి పార్టీలో విశ్వాసాన్ని సమాచారం, గిరిజన హక్కులు, చట్టాల గూర్చి గిరిజన ప్రాంతాల సమస్యలపై పూర్తిగా అవగాహన కలిగిన ఉన్న వ్యక్తి ఈశ్వరరావుని ఆయనకి అరకు పార్లమెంట్ అభ్యర్థిగా టికెట్ కేటాయిస్తే గెలుపు తాధ్యమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తూ చర్చించుకుంటున్నారు. ఈశ్వరరావు విద్యార్థి దశ నుండి ఉద్యమ నాయకుడుగా సామాజిక సేవకుడుగా, ఉన్నత చదువు చదివిన వ్యక్తిగా, ఉత్తమ ఉపాధ్యాయుడుగా, గిరిజాగృతి అసోసియేషన్‌లో సభ్యుడుగా గిరిజన ప్రజానీకానికి విశేష ఆదరణ పొందిన ఈశ్వర రావుకు అరకు పార్లమెంట్ టికెట్ కేటాయిస్తే గెలిపించడానికి మేము సిద్ధంగా ఉన్నామని గిరిజన ప్రజా సంఘాలు, గిరిజన రైతు సం ఘాలు, గిరి యువజన సేవా సంఘాలు, పలు రాజకీయ నాయ తకులు విజ్ఞప్తి చేస్తున్నారు, గిరిజన ప్రాంతంలో నిరుద్యో గులకు, నీరు పేదలకు మహి ళలకు ఉద్యోగస్తులకు సుపరిచితము కలిగిన ఈశ్వరరావుకు వైపు వైసిపి అధిష్టానం అరకులోయ పార్లమెంట్ అభ్యర్థిగా మొగ్గు చూపు తున్నట్టు విశ్వాసనీయ సమాచారం, అందర్నీ కలుపుకునే వ్యక్తిగా నిజాయితీగా సమాజం పట్ల గిరిజన ప్రాంతంలో బాగా పరిచయ మన్నావా వ్యక్తికి అవకాశం ఇస్తే గిరిజనుల సమ స్యలపై చట్టసభల్లో ప్రస్తావిస్తారని, ఏజెన్సీ గిరిజనులకు మంచి జరుగుతుందని కొరతం ఈశ్వర రావుకు అరకు పార్లమెంట్ టికెట్ కేటాయించాలని పలువురు వైసిపి అధిష్టానానికి అభ్యర్థిస్తున్నారు, 2024 సార్వత్రిక ఎన్నికల పోటీలో వచ్చే జాబితాలో పేరు మార్పుకు అవకాశం ఉందని, అరకు పార్ల మెంట్ ప్రజలు, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు, గిరిజన ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేసు ్న్నారు, ఈశ్వరరావుకు అరకులోయ పార్లమెంట్ అభ్యర్థిగా వైసిపి అధిష్టానం చోటు కల్పిస్తే మెజారిటీతో వైఎస్ఆర్సిపి పార్టీ గెలుస్తుందని పలువురు ఆస భావం వ్యక్తం చేస్తున్నారు.

విశాఖను క్రైమ్ క్యాపిటల్‌గా మార్చారు : మాజీమంత్రి గంటా శ్రీనివాసరావు మండిపాటు





విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : విశాఖ రూరల్ తహసీల్దార్ సనపల రమణయ్యను దారుణంగా హత్య చేశారు. ఈ విషయం తెలిసిన వెంటనే మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, టీడీపీ నేతలు కెజిహెచ్ మార్చురీ వద్ద రమణయ్య బంధువులను పరామర్శించారు. అనం తరం గంటా శ్రీనివాస రావు మీడియాతో మాట్లాడుతూ రమణయ్య హత్య దారు ణమని, నిందితులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఒక్కప్పుడు రాయల సీమలో చూసే భూ మాఫియా.. ఇప్పుడు విశాఖలోకి వచ్చేసిందన్నారు. విశాఖకు విష సంస్కృతి తీసుకొచ్చారని, ఒక రెవిన్యూ అధికారికి ప్రాణ రక్షణ లేకపోవడం భాదకరమని అన్నారు. విశాఖలో ఒక ఎంపీ కుటుంబాన్ని 48 గంటలు చిత్రహింసలు పెడితే కనీసం సీఎం జగన్ ఒక్క సమీక్ష కూడా జరపలేదని, అప్పుడే స్పందించి ఉంటే ఈ స్థితి వచ్చేది కాదని గంటా శ్రీనివాసరావు అన్నారు. హెూం మంత్రి ఎక్కడో, డీజీపీ ఎక్కడో తెలియడం లేదన్నారు. వారు విశాఖకు వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించాలని డిమాండ్ చేశారు. విశాఖను పరిపాలన రాజధానిగా కాకుండా, క్రైమ్ క్యాపిటల్‌గా మార్చా రన్నారు. ప్రభుత్వ పెద్దల హస్తం దీని వెనుక ఉందని అనుమానం వ్యక్తం చేశారు. సాధారణ పౌరుడుకి అన్యాయం జరిగితే సీఎం స్పందించాలని, ఒక మండల మేజిస్ట్రేట్ హత్యకు గురైతే ముఖ్యమంత్రి నుంచి ఎలాంటి స్పందన లేదని గంటా శ్రీనివాస రావు తీవ్రస్థాయిలో విమర్శించారు.

మాకు రక్షణ కావాలి... రెవెన్యూ అసోసియేషన్ నేతలు...

రాత్రి 10.30 సమయం లో ఇంటి కి వచ్చి ఒక తాసిల్దార్ ని చంపడం దారుణమని ఏపీ ఎన్జీవో సంఘం విశాఖ జిల్లా కార్యదర్శి రవిశంకర్, రెవెన్యూ అసోసియేషన్ నాయకులు ఈశ్వరరావు అన్నారు. శనివారం ఉదయం కేజీహెచ్ మార్చురి వద్ద తాసిల్దార్ మృతదేహానికి నివాళులర్పించి అనంతరం కుటుంబ సభ్యులకు తమ మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా రెవిన్యూ అసోసియేషన్, ఎన్జీవో నాయకులు మీడియాతో మాట్లాడుతూ విశాఖ భూములు కి ధరలు పెరగడం, ఎమ్మార్వో పై వత్తిడి తేవడం, ప్రభుత్వం ఉద్యోగులు కి మెసేజ్ పంపి బెదిరించడంతో రెవెన్యూ ఉద్యోగులు ఉద్యోగం చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మాకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ భూములకి మేము రక్షణ గా వున్నాం అని, మాకు రక్షణగా ఈ ప్రభుత్వం ఉండాలని డిమాండ్ చేశారు. ఇది ప్లాన్ డ్ మర్డర్ మాత్రమేనని, ఈ రోజు ఎమ్మార్వో కే రక్షణ లేకపోతే సామాన్య మానవుడు పరిస్థితి ఏంటి అన్నారు. దోషులను పట్టు కోవాలని , ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి డిమాండ్ చేశారు. ఒక ప్రభు త్వ ఉద్యోగి పై చేయి వేస్తే ప్రభుత్వం పై చేయి వేసినట్లు భావించాలని, మండల కార్యాలయం వద్ద పోలీసుల బందో బస్తీ ఏర్పాటు చేయాలని కోరారు. విశాఖ రూరల్ మండలం లో కొన్ని వేల కేసు లు పెండింగ్ లో వున్నాయని, సిబ్బందిని పెంచాలని, రూరల్ తాసిల్దార్ కార్యా లయంలో పనిచేయాలంటే ఉద్యోగులకు భయాందోళన నెలకొందన్నారు. తహసిల్దార్ డ్యూటీలో చంప బడ్డారు కాబట్టి పెద్ద మొత్తంలో ఎక్స్ గ్రేషియా,తన భార్య కి ఉద్యోగం ఇవ్వాలి అని డిమాండ్ చేశారు. దోషులకు ఉరిశిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మధ్యాహ్నం భోజన పథకంకు బియ్యం సరఫరా చేయాలి

విశాలాంధ్ర - జీకేవీధి : జీకేవీధి పంచాయతీలో 12 పాఠశాలలకు మూడు నెలల నుంచి మధ్యాహ్నం భోజనం పథకం సంబంధించిన బియ్యం రావడం లేదని ఏపి మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు కె.కుమారి అన్నారు. ఈ విషయాన్ని స్పందనలో జిల్లా కలెక్టర్‌కు తెలియజేయడం జరిగిందన్నారు. మండలంలో ఇప్పటికే అనేక దఫాలుగా ఎంఇఒ, తహశీల్దార్‌ను కలవడం జరిగిందని, అయినా సమస్యల పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ సమస్య పరిష్కరింలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు జే.దేవి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం ప్రజావేదిక

విశాలాంధ్ర - వి.మాడుగుల : మాడుగుల మండలంలో చేసిన ఉపాధి హామీ పథకం పనులపై శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఇజిఎస్ పీడీ ఈ.సందీప్, అడిషనల్ పిడి రోజా రాణి పనులకు సంబంధించిన వివరాలను వివరించారు. ఇప్పటివరకు 18 కోట్ల 23 లక్షల 78 వేల 150 వరకు పనులు జరిగాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిడి శ్రీనివాస్, మండల పరిషత్ అధ్యక్షులు తాళపురెడ్డి వెంకట రాజారామ్, ఎంపిడిఒ ఆర్.కాళీప్రసాద్, ఈఒపిఆర్‌డి మీనా కుమారి, వైస్ ఎంపిపి శ్రీనివాసరావు, సర్పంచ్ యద్ల కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఛలో అసెంబ్లీని విజయవంతం చేయండి

విశాలాంధ్ర - యస్. రాయవరం : ఈనెల ఆరో తేదీన జరిగే చలో అసెంబ్లీ విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షుడు వై. వినోద్ రాజు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ప్రతి నిధులైన సర్పంచులు ఎంపీటీసీలు జడ్పీటీసీ, ఎంపీపీలు, జడ్పీ చైర్మన్లు సమస్యలపై చాంబర్ పిలుపుమేరకు అమరావతిలో చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని తెలపట్టడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా పంచాయతీల్లోని సర్పంచులు సంబంధించి నిధులను రాష్ట్ర ప్రభుత్వము సర్పంచులు ఖాతా నుండి దొంగలించడం జరిగిందని వాటిని వేరే కార్యక్రమాలకు ఉపయోగించడం దారుణం అన్నారు. రాజ్యాంగపరంగా సర్పంచులకు ఉన్న హక్కులను ప్రభుత్వము కల్పించాలని డిమాండ్ చేశారు.

చంద్రబాబును కలిసిన తీగల ప్రభ

విశాలాంధ్ర - గంగవరం : రంపచోడవరం నియోజకవర్గంలోని అన్ని వర్గాలతో సఖ్యతగా సౌమ్యులుగా మరియు ఉన్నత విద్యావంతురాలు మాజీ మండల అధ్యక్షులు అరకు పార్లమెంట్ ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు డాక్టర్ తీగల ప్రభ అమరావతిలోని పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్య మంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు గారిని కలిసి నియోజక వర్గంలోని పార్టీ ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు. తను గత 20 సంవత్సరాల నుండి పార్టీ కార్యక్రమాలలో క్రియాశీలకంగా పనిచేస్తున్నానని మరియు గంగవరం మండల అధ్యక్షులుగా పనిచేసే మండల అభివృద్ధికి ఎనలేని కృషి చేశానని అలాగే పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ నియోజకవర్గంలోనూ మరియు అరకు పార్లమెంటు స్థాయిలోను పార్టీ అభివృద్ధికి పనిచేస్తూనే పార్టీని ప్రజల్లోకి తీసుకు వెళ్లడంలోనూ తన వంతు బాధ్యతగా పనిచేస్తున్నానన్నారు. ఆమె గత ప్రభుత్వంలో ఎంపీపీగా నిస్వార్థంతో నిష్పక్షపాతంగా మండల అభివృద్ధిలో కీలకంగా పనిచేశానని నా యొక్క నిస్వార్థ ప్రజా సేవకు నిదర్శనంగా మరియు గిరిజన ప్రాంతంలో స్థానిక సుపరిపాలనను గుర్తించి భారత్ విర్తువల్ యూనివర్సిటీ ఆఫ్ బెంగుళూరు వారు గౌరవ డాక్టరేట్ ఇచ్చారని పేర్కొన్నారు .తనకో అవకాశం ఇవ్వాలని కోరారు.

వాల్మీకికి సామాజిక న్యాయం చేయాలి

విశాలాంధ్ర - హుకుంపేట : గిరిజన ప్రాంతాల్లో ఉన్న ఎస్టీ ఉపకులల్లో రాజకీయ రంగంలో టికెట్ కేటాయిం పు పై సమతుల్యత చూసి వాల్మీకికి సామాజిక న్యాయం చేయాలని ఆది వాసీ వాల్మీకి సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శి, కార్యవర్గ సభ్యులు ఓ రామూర్తి, కె రామారావు, ఓ రామ లింగంలు డిమాండ్ చేశారు. శనివా రం మండ ల కేంద్రంలో గల స్థానిక ప్రెస్ క్లబ్ లో విలేకర్లతో సమావేశం లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్యంలో ఎస్టీ జాబితాలో వాల్మీకులకు నేటి ప్రభుత్వాలు సామాజిక న్యాయం చేయకపోవటం అన్యాయం అన్నా రు. రాష్ట్రంలో ఎస్టీ ఉప కులాలను సమతుల్యతగా చేడాల్సిన బాధ్యత పార్టీలపై ఉందని పేర్కొన్నారు. నేడు పాడేరు, అరకు నియోజకవర్గల్లో వాల్మీకులకు నియోజకవర్గంలో కానీ పార్లమెంట్లో కానీ టికెట్ కేటాయిం చాలని వారు కోరారు. గత ఎన్నిల్లో వాల్మీకులకు టికెట్ ఇవ్వటంతో విజ యం సాధించి గ్రామాలు, ప్రజలు అభివృద్ధి లక్ష్యంగా పని చేసిన నాయకులు ఉన్నారని గుర్తు చేశా రు. ఈ ఎన్నికల్లో వాల్మీకులకు సామాజిక న్యాయం చేయకపోతే పతిఫలం ఆయా పార్టీలు నాయ కులు అనుభవిస్తారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో వాల్మీకులకు తగిన న్యాయం చేయకపోతే నచ్చిన పార్టీలకు గెలిపించి గుర్తించని నాయ కులకు గట్టి బుద్ధి చెపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి కార్యవర్గ సభ్యులు కే రాంబాబు, ఎస్ అప్పలరాజు, కే కోటి, పాపరావు, ఎం గణేష్, పి నారాయణ, నూకరాజు, అశోక్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్పర్శ లేని మచ్చలపై అప్రమత్తంగా ఉండాలి



విశాలాంధ్ర - అనందపురం : "స్పర్శ" కుష్టి వ్యాధి పక్షోత్సవాల్లో భాగంగ శనివారం ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ గంగు నాయుడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చర్మంపై స్పర్శ లేని మచ్చలు, మందమైన మెరిసే బిడ్డుగల చర్మం,చెవులు పై, వీపుపై, ఎదపై నొప్పి లేని బొడిపెలు. కనుబొమ్మల మరియు కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం. కనురెప్పలు మూతపడకపోవడం. ముక్కుదిబ్బడ ముక్కులో నుండి రక్తం కారడం, కాళ్ళు, చేతులు తిమ్మిరు కలిగి ఉండటం. అరిచేతులు, అరికాళ్ళలో స్పర్శ లేకపోవడం. చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించలేకపోవడం, చేతుల నుండి వస్తువులు జారిపోవడం, చేతి వేళ్ళు, కాళ్ళ వేళ్ళు వంకర్లు తిరిగి అంగవైకల్ రావడం గురించి అవగాహన కల్పించారు.

విశాఖ స్టీల్ జనరల్ హాస్పిటల్ ప్రైవేటీకరణ చర్యలను విరమించుకోవాలి



విశాలాంధ్ర - కూర్మన్న పాలెం : విశాఖ స్టీల్ జనరల్ హాస్పిటల్ ప్రైవేటీకరణ చర్యలను విరమించు కోవాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరామ్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. నేడు స్టీల్ సిఐటియు మరియు మిత్రపక్షాల ఆధ్వర్యంలో విశాఖ స్టీల్ ప్లాంట్ జనరల్ హాస్పిటల్ వద్ద ఈ అంశంపై ధర్నా నిర్వహించారు. దీనిలో పెద్ద ఎత్తున కార్మికులు యాజమాన్యానికి వ్యతిరేకంగా నినదించారు. ధర్నా అనంతరం ఇంచార్జ్ విభాగాధిపతి డాక్టర్ సారంగికి వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి జె అయోధ్యరామ్ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకమైన వి ఎస్‌జిహెచ్‌ని ప్రైవేటు వారికి అప్ప గించాలని ప్రయత్నాలు తక్షణం విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దీనిపై గద్దల్లా వాలడానికి అనేక కార్పొరేట్ ఆసుపత్రులు సిద్ధంగా ఉన్నాయని ఆయన వివరించారు. దీనిని సందర్శించడానికి ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యాలు విచ్చేస్తే యాజమాన్యం ఎర్రతివాసి పట్టి వాటికి స్వాగతం పలకడాన్ని ఆయన తీవ్రంగా వ్యతి రేకించారు. ఇది పోరాటాలతో సాధించు కున్న ఆసుపత్రిని దీనిని పోరాటాల ద్వారానే కాపాడుకుంటామని ఆయన అన్నారు. యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఉంటా యని ఆయన హెచ్చరించారు. సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి మాట్లాడుతూ ఉక్కు ఉద్యోగులకు మెరుగైన వైద్య సదుపాయాల అందించాల్సిన ఆసుపత్రి డాక్టర్లు మరియు వైద్య సిబ్బందితోపాటు పారామెడికల్ స్టాఫ్ లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు. అత్యున్నతమైన నైపుణ్యంతో కరోనా సమయంలో కూడా తమ ప్రాణాలను లెక్కచేయకుండా ఉద్యోగులకు సేవలందించిన వైద్యుల పట్ల ఇంత నిర్లక్ష్యం కూడదని ఆయన అన్నారు. కనుక వీరిని వెంటనే రిక్రూట్ చేసి ఆ సమస్యను తక్షణం పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్, స్టీల్ సిఐటియు సీనియర్ నాయకులు ఎస్ రామారావు, సి ఎఫ్ టి యు నాయకులు శ్రీనివాస్,ఎ ఐ సి టు యు నాయకులు సిహెచ్ సన్యాసిరావు మాట్లాడుతూ ఉద్యోగులకు మందులు అందుబాటులో లేకుండా వారిని తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు వివరించారు. కావున తక్షణమే అన్ని మందులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో స్టీల్ సిఐటియు మరియు మిత్రపక్షాల నాయకులు వి డి వి పూర్ణ చంద్రరావు, గడ వెంకటేశ్వర రావు,లోకేష్, దుర్గాప్రసాద్, కృష్ణమూర్తి, శ్రీనివాస్, రాజు, పవన్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఉపాధ్యక్షులు వివి రమణ, ఐద్వా నాయకురాలు కె వేణు తదితరులతో పాటు అధిక సంఖ్యలో కార్మికులు మరియు మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

మాకు రక్షణ కల్పించాలి

రెవెన్యూ ఉద్యోగుల సంఘం డిమాండ్



విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : ఎమ్మార్వో రమణయ్య ను రాత్రి సమయం లో ఇంటి కి వచ్చి చంపడం దారుణమని , ఎమ్మార్వో లకు రక్షణ కల్పించాలని ఏపి రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు.శనివారం రెవెన్యూ సంఘం నాయకులు కేజీహెచ్ మార్చురీ వద్ద ఎమ్మార్వో బంధువులను పరామర్శించారు. అనంతరం నాయకులు మీడియాతో మాట్లా డుతూ ఉద్యోగుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విశాఖలో భూములు కి ధరలు పెరగడం, ఎమ్మార్వోపై వత్తిడి తేవడం, ప్రభుత్వం ఉద్యోగులకి మెసేజ్ పంపారు అనే పన్నాగం కనిపిస్తుంది అన్నారు. ప్రభుత్వం మాకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం .ప్రభుత్వ భూములకి మేము రక్షణ గా వున్నాం . ఇది ముందస్తు ప్రణాళిక ప్రకారం దాడి చేసి చంపేశారు అన్నారు. ఈ రోజు ఎమ్మార్వో కే రక్షణ లేకపోతే సామాన్య మానవుడు పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. దోషులను పట్టు కోవాలి,ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని కోరారు .ఒక ప్రభుత్వ ఉద్యోగులు పై చేయి వేస్తే ప్రభుత్వం పై చేయి వేసినట్లు భావించాలన్నారు. మండల కార్యాలయం వద్ద పోలీసుల బందో బస్తీ ఏర్పాటు చేయాలి, విశాఖ రూరల్ మండలం లో కొన్ని వేల కేసులు పెండింగ్ లో వున్నాయన్నారు. ఇక్కడ సిబ్బందిని పెంచాలి తహసీల్దార్ డ్యూటీ లో వుండగా చంప బడ్డారు కాబట్టి పెద్ద మొత్తంలో ఇవ్వాలని, ఎక్స్ గ్రేషియా,తన భార్య కి ఉద్యోగం ఇవ్వాలి అని డిమాండ్ చేశారు . ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి శిక్షప డేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మలేరియా జ్వరాలపై ఆరా

విశాలాంధ్ర - వి.మాడుగుల : మాడుగుల మండలంలో మలేరియా జ్వరాలపై మలేరియా జోనల్ అధికారి శాంతి ప్రభ శనివారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాడుగుల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని, కేజే పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ మలేరియా జ్వరాలపై ఆరా తీశారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. మలేరియా జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వ దోరణి వల్లే రైల్వే జోన్ ఆలస్యం

అరెస్టులను ఖండించిన బీజేపీ మాజీ ఎమ్మెల్సీ పివియన్ మాధవ్



విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : జీవీఎంసీ ఎదురుగా గల గాంధీ విగ్రహం వద్ద విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్రం సిద్ధ ంగా ఉన్నా , కావలసిన స్థలాన్ని అప్పగించని ఏపి రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బిజెపి విశాఖ పట్నం శాఖ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాజ్యసభ సభ్యులు జీవీయల్ నరసింహారావు మాట్లాడుతూ విశాఖ రైల్వే జోన్ కు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం దోరని వల్లే ఆలస్యం అవుతుందన్నారు. ఏపీ రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు,మాజీ ఎమ్మెల్సీ పివియన్ మాధవ్ మాట్లాడుతూ కేంద్ర రైల్వే మంత్రి అశ్వనీ వైష్ణవ్ పార్లమెంట్ విభాగంలో రైల్వే జోన్ ఆలస్యానికి కారణం ఏపీ రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించక పోవడమే అని స్పష్టం చేసారన్నారు . కానీ దీనికి భిన్నంగా విశాఖ జిల్లా కలెక్టరు మాత్రం తాము భూమిని కేటాయించినా, రైల్వే వారు తీసుకోలేదనడం అవాస్తవమని అన్నారు.కనుక రాష్ట్రప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఏపీ బీజేపీ చీఫ్ దగ్గుపాటి పురంధీశ్వరి సూచన మేరకు శాంతియుతంగా ధర్నా చేస్తుంటే బీజేపీ కార్యకర్తలను అక్రమ అరెస్టులు చేయడం విడ్డూరంగా ఉందని,ఈ విషయాన్ని ఏపీ భాజాపా తీవ్రంగా ఖండిస్తుందని మాధవ్ అన్నారు.ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భాజాపా బెదిరేది లేదని రాష్ట్రకార్యదర్శి సురేంద్ర మోహన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు మేడపాటి రవీంద్రరెడ్డి,రాష్ట్ర నాయకులు సుహాసినీ ఆనంద్ ,బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు దిలీప్ నాయుడు,వంశీ,నాగరాజు,రామ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా వైయస్సార్ 'ఆసరా' : ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



విశాలాంధ్ర - చింతపల్లి : ఇచ్చిన మాటకు కట్టుబడి నాలుగు దఫాలలో డ్వాక్రా రుణాలు మొత్తాన్ని మాఫీ చేస్తానని చెప్పిన మాట ప్రకారం రుణమాఫీ చేసిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో వెలుగు ఆధ్వర్యంలో నిర్వహించిన వైయస్సార్ ఆసరా సంబరాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా ఎంపీపీ అనూష దేవి జడ్పిటిసి బాలయ్యలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసిన ఆమె రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వెలుగు ఏపిఎం నాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఆసరా సంబరాలను పురస్కరించుకొని ఆమె మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో రూ.34 కోట్ల రుణాలు మాఫీ చేయడం జరిగిందని ఏకైక ప్రభుత్వం వైకాపా అన్నారు. వైయస్సార్ ఆసరా పథకానికి రాష్ట్రవ్యాప్తంగా రూ.25,500 కోట్లు రుణమాఫీ చేసి డ్వాక్రా మహిళల ముఖాల్లో చిరునవ్వులు చూడాలనే లక్ష్యంతో ముందడుగులు వేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వాలు, పాలకులు చేసిన విధంగా కాకుండా ప్రతిపక్షంలో ఉన్న సమయంలో పాదయాత్రలో ఇచ్చిన హామీలనే గాక, మేనిఫెస్టోలో పొందు పరచిన ప్రతి హామీని ఎన్నికలకే పరిమితం చేయకుండా మేనిఫెస్టోను భగవద్గీతలా భావించి ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన నాయకుడు జగనన్న అన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన 98% హామీలను అమలు చేయడమే గాక, మంచి జరిగిందనుకుంటేనే తనకు ఓటు వేయాలని నిర్భయంగా చెప్పగలిగిన ఒకే ఒక్క నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని ఆమె కితాబిచ్చారు. మహిళల ఆర్థిక పురోభివృద్దే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి అందించిన నాయకుడు జగన్మోహన్ రెడ్డి అన్నారు. మహిళ బాగుంటేనే ఇల్లు, సమాజం, రాష్ట్రం, దేశం బాగుంటాయన్న సత్యాన్ని నమ్మి మహిళా పక్ష పాతిగా పరిపాలన సాగిస్తున్న జగనన్నకు ప్రజలే స్టార్ క్యాంపెనర్లు అన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టేందుకు ఓటునే ఆయుధంగా చేసుకుని బుద్ధి చెప్పాలన్నారు. ఈ సందర్భంగా వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు ఆమెను దుస్సాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జడ్పిటిసి పోతురాజు బాలయ్య, స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీటీసీలు చిందాడ జయలక్ష్మి, దాసరి దారలక్ష్మి, వైస్ ఎంపీపీ సాగిన వెంగళరావు లు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళి, ఎంపీపీ కోరాబు అనూష దేవి, వైస్ ఎంపీపీ గోపి నాయక శారద, పార్టీ మండల అధ్యక్షుడు మోరి రవి, స్వచ్ఛంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మీరా, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నాజర్ వలీ, (బి బి సి) , జేసిఎస్ మండల కన్వీనర్ పాంగి గుణబాబు, సర్పంచులు లలిత కుమారి, పండయ్య , ఎంపిటిసి మీనా కుమారి, రూతు, ఎంపీడీవో సాయిబాబు, ఈవోపీఆర్డి శ్రీనివాస్, వైకాపా నాయకులు, కార్యకర్తలు, వెలుగు సిబ్బంది, అధిక సంఖ్యలో డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

వైసిపి అరాచక పాలన నచ్చకే టిడిపిలో చేరికలు : మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

విశాలాంధ్ర - అల్లూరి జిల్లా పాడేరు : వైసీపీ జగన్మోహన్ రెడ్డి అరచక పాలన నచ్చకే వైసీపీకి చెందిన కార్యకర్తలు నాయకులు టిడిపిలో చేరుతున్నారని పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. శనివారం చింతాపల్లి మండలం ఎర్ర బొమ్మలు పంచాయితీ, కొండవచుల, ఎర్ర బొమ్మలు గ్రామాలకు చెందిన పాడి సంజీవరావు గ్రామ అధ్యక్షులు, మోహన్ రావుల యూత్ లిడార్, ఆధ్వర్యంలో సత్యనారాయణ, రాజ్ కుమార్, సత్యనారాయణ, సురేష్, రామారావు, రవి ప్రసాద్, విగ్నేష్, ఉపేంద్ర, రామచంద్రరావు వెంకట్రావు బాబురావు, బాబులు, కృష్ణ, వీరితోపాటు 120 కుటుంబాలకు చెందిన వైసిపి ఇతర పార్టీలకు చెందిన వారు పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం తెదేపా ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ వైసిపి దుర్మార్గపు పాలన పోయి సైకిల్ పాలన వస్తేనే మన బ్రతుకులు బాగుపడతాయని, ఒక్క ఛాన్స్ ఇచ్చినందుకు గిరిజన ప్రాంతంలో జీవో నెంబర్ 3 కొట్టివేస్తే కనీసం రివ్యూ పిటిషన్ కూడా వెయ్యలేని దుస్థితి వైసిపి పాలకులు గిరిజన యువతి యువకులకు ఎటువంటి ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వచ్చేసరవత్రిక ఎన్నికలలో ఓటుతో బుద్ధి చెప్పడానికి ప్రజలందరూ సంసిద్ధంగా ఉన్నారని ఆమె అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు సోమేలి చిట్టిబాబు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి గబ్బాడ సింహాచలం, రాష్ట్ర ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి కొట్టగుల్లి రమేష్ నాయుడు, అరుకు పార్లమెంట్ ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి డిప్పల వెంకట కుమారి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను నమ్మించడానికి డిఎస్సీ పేరుతో జగన్నాటకం - బుద్ధ నాగ జగదీష్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : ఎన్నికలకు 2 నెలల ముందు డిఎస్సీ నోటిఫికేషన్ అంటూ ముఖ్యమంత్రి సరికొత్త జగన్నాటకానికి తెరలేపారని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు జగన్ రెడ్డి పై విరుచుకుపడ్డారు. 4 సంవత్సరాల తొమ్మిది నెలలుగా ఉపాధ్యాయుల భర్తీని పట్టించుకోకుండా ఇప్పుడు రాజకీయ ఎత్తుగడలో భాగంగా ఎన్నికల ముందు హడావుడి చేస్తున్నారని,అబద్దాలు, మోసం, వంచనకు బ్రాండ్ అంబాసిడర్ అయిన జగన్ రెడ్డి ఎన్నికల ముందు 23 వేల ఖాళీలు ఉన్నాయి, మెగా డీఎస్సీ ఇస్తామని, ఆ తర్వాత ఏడాదికి ఒక డీఎస్సీ అన్నారని,గిరిజన యువతకు ప్రత్యేక డీఎస్సీ అన్నారని, ఇప్పుడు చివరకు ప్రజాగ్రహానికి గురై ఇంటికెళ్లే ముందు 6వేల పోస్టులు భర్తీచేస్తామని క్యాబినెట్లో ఆమోదం చేశారని అది కూడా ఏప్రెంటిస్ గా నాగ జగదీష్ అన్నారు . 2021 - 22 నాటికి ఎపిలో 50 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 12386 పాఠశాలలు ఒక్క ఉపాధ్యాయుడితోనే నడుస్తున్నాయని కేంద్రం పార్లమెంట్ సాక్షిగా చెప్పిందని, రాష్ట్రవ్యాప్తంగా 18 వేల ఖాళీలు ఉన్నాయి కానీ 8,366 పోస్టులు భర్తీ చేస్తామని మంత్రి బొత్స అసెంబ్లీలో సెలవిచ్చారని . ఇప్పుడు అందులో కూడా 2,366 పోస్టులు కోతపెట్టి 6 వేల పోస్టులకు నోటిఫికేషన్ అంటున్నారని ఇది నిరుద్యోగ యువకులను మోసం చేయడం కాదా?నాగ జగదీష్ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి, విద్యామంత్రి బొత్స మాత్రం పూటకోమాట చెబుతూ చివరకు నిరుద్యోగులను నిండా ముంచేశారని, ప్రత్యేక హోదా వస్తే ఐదు లక్షల ఉద్యోగాలు వస్తాయని, అలాగే ప్రభుత్వంలో ఉన్న 2 లక్షల 30 వేలు ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగ సమస్య నిర్మూలన చేస్తామని ఎన్నికలకు ముందు డబ్బాలు కొట్టిన జగన్ రెడ్డి నేడు చేతులు వెత్తేసారని మడము తిప్పేసారని నాగ జగదీష్ ఎద్దేవా చేశారు. వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా నిరుద్యోగ యువతకు న్యాయం చేస్తారని, ఇప్పటికే మినీ మేనిఫెస్టో లో హామీ ఇచ్చారని, అలాగే నిరుద్యోగ భృతి 3000 రూపాయలు ప్రకటించారని, వారికి న్యాయం జరుగుతుందని నాగ జగదీష్ ఆశాభావం వ్యక్తపరిచారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర టీఎన్టియుసి ఉపాధ్యక్షులు ధనాల విష్ణు చౌదరి అనకాపల్లి పార్లమెంటు తెలుగు యువత అధికార ప్రతినిధి బొద్దేడ మురళి పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణ బీసీ నాయకులు కొమ్మర్తి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలను చంద్రబాబు మోసం చేశారు : ఎమ్మెల్యే భాగ్యలక్ష్మీ



విశాలాంధ్ర - జీకేవీధి : రూపాయి అప్పు కట్టవద్దు అధికారంలోకి వచ్చిన వెంటనే తీసుకున్న ప్రతి రుణాన్ని మాఫీ చేస్తామని ఓట్లు వేయించుకొని డ్వాక్రా సంఘాలను నిట్ట నిలువునా మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు నాయుడు అని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. జీకేవీధి మండల కేంద్రంలో శనివారం వైయస్సార్ ఆసరా సంబరాలను నిర్వ హించారు. ముందుగా వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జీకేవీధి మండలంలో 292 గ్రూపులకు గాను 2,995 డ్వాక్రా సంఘ సభ్యులు కోటి 5లక్షల రూపాయలు నాలుగో విడతగా రుణమాఫీ చేశారని తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే పార్టీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్నారు. తప్పుడు హామీల నుంచి ప్రజలను మోసగించే పార్టీ టిడిపి అని నాయకుడు చంద్రబాబునాయుడుని ఈ వ్యత్యాసాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు. ఈరోజు సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు అందిస్తున్న ప్రతి రూపాయి పార దర్శకంగా అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. రూపాయి అవినీతి లేని పాలన జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. మన పరిస్థితులను మార్చిన జగన్‌కు మనమంతా అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కిముడు శివరత్నం, ఎంపీపీ బోయిన కుమారి, వైస్ ఎంపీపీలు ఆనంద్, దేముడు, స్థానిక సర్పంచ్ కొర్రా సుభద్ర, స్థానిక ఎంపిటిసిలు పసుపులేటి నాగమణి, రాజులమ్మ, మండల అధ్యక్షులు బబ్బిలి లక్ష్మణ్, జేసిఎస్ మండల కన్వీనర్ పోతురాజు కృష్ణమూర్తి, సర్పంచుల ఫోరం అధ్యక్షులు కుందరి రామకృష్ణ, సీలేరు ఎంపీటీసీ సాంబమూర్తి, వైసిపి సీనియర్ నాయకులు అడపా విష్ణుమూర్తి, మచ్చల మత్స్యరాజు, కంకిపాటి గిరి ప్రసాద్, వంతల అరుణకుమార్, రామారావువైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం పేద ప్రజలకు వరం



విశాలాంధ్ర - చింతపల్లి : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతులుగా జీవితాన్ని గడపాలని స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. చింతపల్లి పంచాయతీ పరిధిలోని చిన్న గెడ్డ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆర్వి నగర్ వైద్యాధికారిని సౌమ్య, రాజా రవీంద్రనాథ్ చౌదరి, స్థానిక సామాజిక ఆసుపత్రి వైద్యాధికారి అజయ్ లతో కలిసి నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి విచ్చేసిన సర్పంచ్ పుష్పలత మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు వరమన్నారు. నిరుపేదలకు సైతం కార్పొరేట్ తరహా వైద్యం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా అందుబాటులోకి తీసుకురావడం శుభ పరిణామమన్నారు. ఇటువంటి బృహత్తర కార్యక్రమాలు నిర్వహిస్తున్న వైకాపాను మరోమారు అధికారంలోకి వచ్చేందుకు ఆశీర్వదించాలన్నారు. ఈ సందర్భంగా ఆమెతోపాటు ఎంపిటిసి సభ్యురాలు దాసరి దార లక్ష్మి, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, వాలంటీర్ల సంఘం మండల అధ్యక్షుడు వేములపూడి పరమేశ్వర రావు లు వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. వీరే గాక వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 150 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి సౌమ్య మాట్లాడుతూ వైద్య పరీక్షలు చేయించుకున్న వారిలో పలువురికి థైరాయిడ్ సమస్య ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యాధికారి వెంకటరమణ, ఎం పి హెచ్ ఈ ఓ జాన్సన్, హెల్త్ సూపర్వైజర్ శాంతమణి, పంచాయతీ కార్యదర్శి కె శ్రీనివాస్, సచివాలయ కార్యదర్శి శివకుమార్, సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు ఏఎన్ఎంలు డివి రమణమ్మ, కే విజయలక్ష్మి, పి కుమారి, ఎస్ వరలక్ష్మి, ఎం ఎల్ హెచ్ పి శ్రీవాణి, లక్ష్మి ఆశా కార్యకర్తలు సచివాలయ సిబ్బంది గ్రామ వాలంటీర్ల తోపాటు చిన్న గెడ్డ, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పరిశుధ్యానికే మొదటి ప్రాధాన్యత : జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు



విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : పారిశుధ్య నిర్వహణకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు నాల్గవ జోనల్ కమిషనర్ బంటు సన్యాసినాయుడు పేర్కొన్నారు. శనివారం ఆయన 28వ వార్డు శానిటరీ కార్యాలయాన్ని, రాంనగర్, నెహ్రూ నగర్, వాల్తేరు రోడ్డు తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ నాల్గవ జోన్ లో పారిశుధ్య నిర్వహణకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. 4వ జోన్ పురాతనమైన నగరమని, కావున ఇక్కడ వీధులు చాలా ఇరుకుగా ఉన్నందున వ్యర్థాలు అధికంగా ఉత్పత్తి అవుతాయని, వీటిని నిరంతరం తొలగించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముందుగా 28వ వార్డు శానిటరీ కార్యాలయాన్ని సందర్శించి పారిశుధ్య కార్మికుల హాజరు పట్టీని పరిశీలించారు. ఎవరికి నిర్దేశించిన పనిని వారు సక్రమంగా నిర్వర్తించి రోడ్లు, కాలువలు శుభ్రపరచాలని ఏ రోజు చెత్త అదే రోజు కాపులుప్పాడ డంపింగ్ యార్డ్ కు తరలించాలని శానిటరీ ఇన్స్పెక్టర్, వార్డు సచివాలయ శానిటరీ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం ఎం.ఎస్.ఎఫ్-4 ను జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ సేకరించిన వ్యర్థాలను నిలవ లేకుండా ఎప్పటికప్పుడు కాపులుప్పాడ డంపింగ్ యార్డ్ కు తరలించాలని, నిర్ణీత సమయానికే క్లాప్ వాహనాలు విధుల్లో పాల్గొనేలా చూడాలని జోనల్ కమీషనర్ ను ఆదేశించారు.